ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత శుక్రవారం గరిష్ఠం : 34.0 కనిష్ఠం : 23.0
ANDHRAJYOTHY


అనంతపురం
జిల్లా వార్తలు
శనివారం 6 సెప్టెంబరు 2025

టీచర్లే మార్గదర్శకులు

- కలెక్టరు వినోద్‌కుమార్
- ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

అనంతపురం విద్య, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఉపాధ్యాయులే మార్గదర్శకులని కలెక్టర్ వినోద్‌కుమార్ ప్రశంసించారు. వారి మార్గదర్శకత్తంలో విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలని అభిలషించారు. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ ఆర్ట్స్ కళాశాలలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని విద్యాశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టరు మాట్లాడుతూ ఓ వైపు విద్యాబోధన చేస్తూనే ప్రభుత్వాలు అప్పగించిన పనులు నిబద్ధతతో చేస్తున్న టీచర్లకు హ్యాట్సాఫ్ అని ప్రశంసించారు. గత ఏడాది ఎన్నికలు జిల్లాలో విజయవంతం చేయగలిగామంటే టీచర్ల కృషి వల్లేనన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న అనేక విద్యా పథకాలను ప్రతి టీచర్ ఓ సైనికుడిలా పని చేసి సక్సెస్ చేస్తున్నట్లు ప్రశంసించారు. టీచర్లకు సమాజంలో ఎంతో గొప్పస్థానం ఉందని పేర్కొన్నారు. ఇక నుంచి వారంలో ప్రతి శనివారం సాయంత్రం ఓ గంట పాఠశాలల సమస్యలపైనా, విద్యార్థుల ప్రతిభపైన కాన్ఫరెన్స్ నిర్వహిస్తానన్నారు. ఈకాన్ఫరెన్స్ ద్వారా వచ్చిన సమాచారాన్ని ఏఐ ద్వారా మాట్లాడేలా సోషల్‌మీడియాలో పెడతామని కలెక్టరు హామీ ఇచ్చారు.




మాట్లాడుతున్న కలెక్టరు వినోద్‌కుమార్, హాజరైన అవార్డు గ్రహీతలు, టీచర్లు, వారి కుటుంబ సభ్యులు

ఈవేడుకలలో డీఈఓ ప్రసాద్‌బాబు, ఎస్ఎస్ఏ ఏపీసీ శైలజ, విద్యాశాఖ ఏడీలు మునీర్, శ్రీనివాసులు, ఉపాధ్యాయ సంఘాల నేతలు, టీచర్లు పాల్గొన్నారు.

టీచర్లంటే అభిమానం: ఎమ్మెల్యే దగ్గుపాటి

ఉపాధ్యాయులు అంటే సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్‌కు ఎనలేని అభిమానం. ఉపాధ్యాయ వృత్తి పూర్వజన్మఫలమని, అలాంటి వృత్తిలోకి రావడం మీ అదృష్టం. ఇప్పటికే అనేక ఆర్థికపరమైన అంశాలను మా ప్రభుత్వం నెరవేర్చింది. మిగిలిన వాటిని త్వరలో పరిష్కరిస్తాం. టీచర్లు మంచిగా పని చేసి అనంత జిల్లాను ఆదర్శంగా నిలపాలి.

ప్రపంచాన్ని మార్చేశక్తి: బోయ గిరిజమ్మ, జడ్పీ చైర్‌పర్సన్

సమాజమేకాదు ప్రపంచాన్నే మార్చే శక్తి ఉపాధ్యాయులకే ఉంది. ఒకరిద్దరి వల్ల మొత్తం టీచర్ వ్యవస్థకే చెడ్డపేరు వస్తుందని, అందుకే ప్రతిఒక్కరూ బాధ్యతగా మెలగాలి. సర్వేపల్లి రాధాకృష్ణన్ నడయాడిన ఆర్ట్స్ కళాశాలలో ఈ వేడుకలు నిర్వహించడం ఎంతో ఆనందదాయకం.

77మందికి ఉత్తమ పురస్కారాలు

ఉపాధ్యాయ దినోత్సవాన్ని జిల్లాయంత్రాంగం శుక్రవారం అట్టహాసంగా నిర్వహించింది. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వడిగ్రీ ఆర్ట్సకళాశాలలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో వేడుకలు కొనసాగాయి. ఈవేడుకలకు ముఖ్యఅతిథులుగా కలెక్టరు వినోద్‌కుమార్, జడ్పీ చైరపర్సన్ బోయగిరిజమ్మ, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, డీఈఓ ప్రసాద్‌బాబు, ఏపీసీ శైలజ, డిప్యూటీ డీఈఓ మల్లారెడ్డి, తదితరులు హాజరయ్యారు. జిల్లాస్థాయి ఉత్తమ అవార్డులు పొందిన 77మందికి కలెక్టరు, ఎమ్మెల్యే, జడ్పీ చైర్‌పర్సన్, డీఈఓ, ఏపీసీ చేతులమీదుగా సత్కారం చేశారు. అనంతరం అవార్డుగ్రహీతలను బంధువులు, తోటి టీచర్లు పూలమాలలువేసి అభినందించారు.



ఉపాధ్యాయ దినోత్సవ సందడి

యూరియా కొరత సృష్టిస్తే కఠిన చర్యలు : కలెక్టర్

శింగనమల, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ వినోద్‌కుమార్ హెచ్చరించారు. మండలంలోని నాయనపల్లి క్రాస్, పెరవలి ఆగ్రో ఏజెన్సీ, లక్ష్మీ నరసింహ దుకాణాన్ని కలెక్టర్ వినోద్‌కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. లైసెన్స్, స్టాక్ రిజిస్టర్, బిల్‌బుక్కులు, గౌడౌన్‌లోని ఎరువులను తనిఖీ చేశారు. అక్కడే ఉన్న రైతులతో ఎరువుల విక్రయాలపై ఆరా తీశారు. యూరియా కొరత కేవలం ప్రచారమేనని, ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శేషారెడ్డి డిప్యూటీ తహసీల్దార్ సూర్యప్రతాప్ మార్కెఫెడ్ డీఎం, సీఎస్ డీటీ, ఉద్యాన శాఖ అధికారులు ఏవో అన్వేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పెద్దజలాలపురంలో చీనీ తోటను పరిశీలిస్తున్న కలెక్టర్

చీనీ చెట్లను కాపాడే బాధ్యత మీదే

తెగుళ్లను నివారించి, చీనీ చెట్లను కాపాడే బాధ్యత అధికారులదేనని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని పెద్ద జలాలపురం గ్రామంలో రైతు రామయ్య చీనీ తోటను కలెక్టర్, ఉద్యాన శాఖ అధికారులు శుక్రవారం పరిశీలించారు. రెండెకరాల తోటలో కొన్ని చెట్లు చనిపోతుండటం గమనించిన కలెక్టర్ ఉద్యాన శాఖ అధికారులతో ఆరా తీశారు. ఫిజియోరియం విల్ట్ అనే శిలీంధ్రం వల్ల వేరుకుళ్లు తెగులు సోకి చెట్లు చచ్చిపోతున్నట్లు తెలిపారు. అందుకే రైతులు చీనీ మొక్కలు ఎంపికలో నే రంగపూర్‌లైం మొక్కలు తీసుకుంటే తెగుళ్లు సోకకుండా ఉంటా యన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ చీనీ చెట్లలో తెగుళ్ల నివారణకు రైతులకు సహకారం అందించాలని ఆదేశించారు.

యూరియా పంపిణీ కేంద్రాలను తనిఖీ చేసి జేడీఏ

మండలంలో యూరియా పంపిణీ చేసిన తరిమెల రైతు సేవా కేంద్రాన్ని జేడీఏ ఉమామహేశ్వరమ్మ, వ్యవసాయ సహాయ సంచాల కుడు వెంకటరాముడు తనిఖీ చేశారు. పంపిణీ కేంద్రం వద్ద రైతులతో మాట్లాడారు. అనంతరం భైరవ ఫర్టిలైజర్స్‌ను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు.

బీజేపీలోకి వైసీపీ కౌన్సిలర్లు



వైసీపీ నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

రాయదుర్గం, అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాయదుర్గంలో వైసీపీకి కౌన్సిలర్లు షాక్ ఇచ్చారు. మున్సిపల్ వైస్ చైర్మన్ సహా ఐదుగురు బీజేపీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాపు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో విజయవాడలో శుక్రవారం ఆ పార్టీలో చేరారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నందిరెడ్డి శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ సమక్షంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ వారికి కండువా వేసి ఆహ్వానించారు. రాయదుర్గం మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాస యాదవ్, కౌన్సిలర్లు శ్రీనివాసరెడ్డి, షబ్బీర్, ఏటూరి రమేష్, డిష్ గోవిందరాజులు, వన్నూరప్ప, ఎంపీపీ సలహాదారుడు డబ్బతి నాగిరెడ్డి, సీనియర్ నాయకులు రవీంద్రారెడ్డి, శంకర్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కుమార్‌రెడ్డి, గొల్ల రామాంజినేయులు, బాబు బీజేపీలో చేరిన వారిలో ఉన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమానికి ఆకర్షితులై వైసీపీ నాయకులు బీజేపీలో చేరారని మాధవ్ అన్నారు.

చేలన్నీ.. వెంచర్లే..!



బ్రాహ్మణపల్లి సమీపంలో వెలసిన అనుమతులు లేని వెంచర్



గొట్కూరు గ్రామం వద్ద ఓ వెంచర్ వెనుక వంక నీరు వెళ్లేందుకు నిర్మించిన కాలువ

కూడేరు మండలంలో ఊరూరా వెలుస్తున్న వైనం

- చాలావాటికి అనుమతులు లేవు
- కన్వర్షన్ కాకపోయినా... ప్లాట్ల ఏర్పాటు
- పేపర్ లే అవుట్‌తో ప్లాట్ల విక్రయాలు

కూడేరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రానికి పక్కనే మండలం ఉంది. దీంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం విస్తరించింది. పంట పొలాలు మాయమవుతున్నాయి. వెంచర్లు ప్రత్యక్షమవుతున్నాయి. భూములు, ప్లాట్ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. చాలా వెంచర్లకు అనుమతులు లేవు. వ్యవసాయ భూమిని కన్వర్షన్ కూడా చేసుకోలేదు. అక్రమంగా ప్లాట్లు వేసి, అమాయకులకు అంటగడుతున్నారు. రూ.లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు. ఇదంతా పబ్లిక్‌గానే సాగుతోంది. అధికారులు అటువైపు కన్నెత్తి చూడరు ఎందుకో?

అన్నింటికీ తిలోదకాలు


వెంచర్ వేయాలంటే వ్యవసాయ భూమిని వ్యవసాయేతరంగా కన్వర్షన్ చేయాలి. ఆ తరువాత అహుడా అప్రూవల్‌కు వెళ్లాలి. తాత్కాలికంగా ఎల్‌పీ నంబరుతో వెంచర్ ఏర్పాటు చేసుకుంటేనే అప్రూవల్ లభిస్తుంది. ఆ నంబర్‌లో ప్లాట్ల రిజిస్ట్రేషన్ చేయకూడదు. ఈ ప్రక్రియలన్నీ ముగిశాకే ప్లాట్లను అమ్ముకోవచ్చు. కూడేరు మండలంలో కొందరు రియల్టర్లు ఇవేవీ పాటించట్లేదు. నిబంధనలతో తమకేం పని అన్నట్లు వ్యవహరిస్తున్నారు. భూమి ఉంటే చాలు.. వెంచర్లు వేసేసి.. సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి, గొట్కూరు పొలాల్లో కొందరు రియల్టర్లు ఏర్పాటు చేసిన వెంచర్లే ఇందుకు నిదర్శనం. అధికారుల ఉదాసీనతతో వెంచర్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయన్న విమర్శలు లేకపోలేదు. నిబంధనలు తెలియని ప్రజలు.. రూ.లక్షల్లో వెచ్చించి అనుమతుల్లేని ప్లాట్లను కొనుగోలు చేసి, మోసపోతున్నారు.



వెంచర్‌లోకి వెళ్లే దారి

అనుమతుల్లేకుండానే..

మండలంలోని బ్రాహ్మణపల్లి, గొట్కూరు, కమ్మూరు గ్రామాల పరిధిలో కొందరు రియల్టర్లు.. వెంచర్లను ఏర్పాటు చేశారు. ఆ భూములను కన్వర్షన్ చేయలేదు. బ్రాహ్మణపల్లి సమీపంలోని సర్వే నంబరు 34లోగల వ్యవసాయ భూమిలో ఓ పేరుమోసిన సంస్థ 14 ఎకరాల్లో వెంచర్ ఏర్పాటుకు సిద్ధం చేసింది. ఆ వెంచర్‌కు కన్వర్షన్, అహుడా అనుమతుల్లేవు. అయినా పేపర్ రూపంలో లేఅవుట్‌ను సిద్ధం చేశారు. ఆ పేపర్ పట్టుకొని ఒక్కో ప్లాటు రూ.3 లక్షల నుంచి రూ.4లక్షలకు పైగా విక్రయించే ప్రయత్నాలు మొదలెట్టారు. వారి మాటలు నమ్మి, పలువురు కొనుగోలు చేసినట్లు సమాచారం. గొట్కూరు సమీపంలోని ప్రధాన రహదారికి అనుకుని సర్వే నంబరు 123లో 2.25 ఎకరాల్లో, సర్వే నంబరు 134/ఏలో 3.35 ఎకరాల్లో ఓ రియల్ ఎస్టేట్ సంస్థ వెంచర్ ఏర్పాటు చేసింది. ఈ వెంచర్‌కు అనుకుని వర్షం నీరు ప్రవహించే వంక ఉంది. ఆ వంకను పక్కకు మళ్లించి మరీ వెంచర్‌ను ఏర్పాటు చేశారు. వంకలో ఒకటిన్నర కిలోమీటరు దూరం నుంచి వర్షపు నీరు దాదాపు 618 క్యూసెక్కులు ప్రవహిస్తుందని ఇరిగేషన్ అధికారులు అంచనా వేశారు. వర్షం వస్తే ఆ వంక ద్వారా అరవకూరు నుంచి అనంతపురం రూరల్ మండలం కొడిమి వరకూ ప్రవహిస్తుందని చెబుతున్నారు. అయినా వెంచర్ వేసినవారు ఆ వంకకు చిన్న కాలువ నిర్మించి చేతులు దులుపుకున్నారు. వర్షాలు అధికంగా వస్తే ఆ కాలువ ఉప్పొంగితే గొట్కూరు వెళ్లే రోడ్డు దెబ్బతినే ప్రమాదం లేకపోలేదు. ఇరిగేషన్ అధికారులు 618 క్యూసెక్కులు ప్రవహించే కాలువను చూశారో లేదో తెలియదుగానీ... అనుమతులిచ్చేశారు. ఈ అనుమతుల వెనుక ఆ శాఖ అధికారులకు భారీగా ముడుపులు అందినట్లు తెలుస్తోంది.





రోడ్డు కింద నీరు ప్రవహించే ఏర్పాటు

బరితెగిస్తున్న రియల్టర్లు

అనంతపురం-బళ్లారి ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న కూడేరు మండలంలోని భూములు రూ.కోట్లలో ధరలు పలుకుతున్నాయి. ఇప్పటికే ఉరవకొండ నియోజకవర్గంలో విమానాశ్రయం ఏర్పాటు అనే ప్రచారం జోరుగా సాగుతుండటంతో రియల్టర్ల కన్ను పడింది. రైతుల నుంచి భారీగా భూములు కొనుగోలు చేసి, అనుమతుల్లేకుండానే వెంచర్లు ఏర్పాటు చేస్తున్నారు. సంబంధిత శాఖల్లోని కొందరు అధికారుల ఉదాసీనత, కాసుల కక్కుర్తితోనే ఈ తతంగమంతా సాగుతున్నట్లు సమాచారం. కొందరు అధికారులు కన్వర్షన్‌కు ఒక్కో రేటు పెట్టి అనుమతులిచ్చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అహుడాలోని మరికొందరు అధికారులు ఎల్‌పీ నంబర్, అహుడా అప్రూవల్‌కు రేట్లు పెట్టి, వెంచర్లకు అనుమతులిచ్చేస్తున్నట్లు తెలుస్తోంది. క్షేత్రస్థాయిలో పరిశీలించకుండానే అనుమతులు ఇచ్చేస్తున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

నోటీసులిస్తాం..



బ్రహ్మణపల్లి పొలం సర్వే నంబరు 34లో వేసిన వెంచర్‌కు అనుమతులు లేవు. కన్వర్షన్‌కు దరఖాస్తు కూడా చేయలేదు. దీంతో వెంచర్ వేసిన సంస్థకు నోటీసులు జారీ చేస్తాం. పనులు చేపట్టకుండా అడ్డుకుంటాం.

- మహబూబ్ బాషా, తహసీల్దార్, కూడేరు

చురుగ్గా సూపర్ హిట్ పనులు

- సభాస్థలిని పరిశీలించిన మంత్రి కొల్లు
- హెలీప్యాడ్ ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ



సభా స్థలం వద్ద ప్రజా ప్రతినిధులు, నాయకులతో మంత్రి కొల్లు రవీంద్ర (వివరాలు 6లో...)

సమాజ శ్రేయస్సుకు పాటు పడాలి

- ముస్లిం మత పెద్దలు
- భక్తిశ్రద్ధలతో మిలాద్-ఉన్-నబీ వేడుకలు



మిలాద్ ఉన్ నబీ సందర్భంగా నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు (వివరాలు 6లో...)

నేడు జనసేన సమావేశం

- జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఈ నెల 10న నిర్వహించే సూపర్ సిక్స్-సూపర్ హిట్ సభ నేపథ్యంలో జనసేన పార్టీ జిల్లా నాయకుల సమావేశాన్ని శనివారం నిర్వహిస్తున్నామని పార్టీ జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్ తెలిపారు. పార్టీ పరంగా ఈ సభకు ఏమి చేయాలన్నది నాయకులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఆయన తెలిపారు. రుద్రంపేటలోని యాదవ కల్యాణ మండపంలో ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమౌతుందని ఆయన తెలిపారు. ఇప్పటికే పార్టీ నాయకులందరికీ సమాచారం అందించామని అన్నారు. జిల్లా నలుమూలల నుంచి నాయకులు పెద్ద ఎత్తున హాజరై సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు.

మళ్లీ.. నేల చూపులు..!

- వారంరోజులుగా తగ్గుముఖం పట్టిన టమోటా ధరలు
- దారుణంగా పడిపోతున్న వైనం
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు


6 లో





అనంతపురం నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

సమాజ శ్రేయస్సుకు పాటు పడాలి

- ముస్లిం మత పెద్దలు
- భక్తిశ్రద్ధలతో మిలాద్-ఉన్-నబీ వేడుకలు

అనంతపురం టౌన్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రవక్త బోధనలను అనుసరించి సమాజ శ్రేయస్సుకు ప్రతి ముస్లిం పాటు పడాలని మతపెద్దలు పిలుపునిచ్చారు. మహమ్మద్ ప్రవక్త పుట్టిన రోజును పురస్కరించుకుని శుక్రవారం మిలాద్-ఉన్-నబీ వేడుకలను జిల్లా వ్యాప్తంగా ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జిల్లా కేంద్రంతోపాటు ప్రధాన పట్టణాల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రతి మసీదు, మదరసా, దర్గాల నుంచి ముస్లింలు జెండాలు చేతబూని ర్యాలీలు నిర్వహించా రు. నగరపాలకసంస్థ మేయర్ వసీం, ముతవల్లిల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఎం షకీల్ షఫి, గ్రంథాలయసంస్థ మాజీ ఛైర్మన్ గౌస్‌మొద్దీన్, కాంగ్రెస్ నాయకుడు దాదాగాంధీలు ముస్లింలతో కలిసి శాంతిర్యాలీలు చేపట్టారు. పండుగ సందర్భంగా పలు ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం దర్గాలు, మసీదులలో మహమ్మద్ ప్రవక్త పవిత్ర కేశ దర్శనం నిర్వహించారు. జిల్లా కేంద్రంలో రెండో రోడ్డులోని బహవుద్దీన్ మసీద్, పాతూరులోని మాసుమాబీ దర్గా, ఆసార్ దర్గా తదితర ప్రాంతాల్లో పవిత్ర కేశ దర్శనాన్ని నిర్వహించారు. మిలాద్-ఉన్-నబీ వేడుకల్లో భాగంగా నగర ప్రధాన వీధుల్లో బైకు ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలకు జనసేన ఆధ్వర్యంలో వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ మిషన్ రాష్ట్ర డైరెక్టర్ భవానీ రవికుమార్ చేతుల మీదుగా ఈ కార్యక్రమం నిర్వహించారు.



కార్లపై మినార్‌లను ఊరేగిస్తున్న ముస్లింలు




గ్రంథాలయసంస్థ మాజీ ఛైర్మన్ గౌస్‌మొద్దీన్‌కు శుభాకాంక్షలు చెబుతున్న జనసేన నాయకుడు రవి కుమార్



శాంతిర్యాలీలో పాల్గొన్న మేయర్ వసీం, కేఎం షకీల్ షఫీ, దాదాగాంధీ తదితరులు

కదిలించిన అక్షరం

వేణుగోపాల్ నగర్‌లో విద్యుత్ స్తంభాల ఏర్పాటు



కొత్తచెరువు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించిన 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' సక్సెస్ మీట్ తరువాత మిగిలిన సమస్యల పరిష్కారం వేగవంతమైంది. పట్టణంలోని వేణుగోపాల్ నగర్‌లో విద్యుత్ శాఖ అధికారులు స్తంభాలను ఏర్పాటు చేయిస్తున్నారు. ఈ నెల 3వ తేదీ స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో సక్సెస్ మీట్ జరిగింది. పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, వివిధ శాఖల అధికారులు, ప్రజలు హాజరయ్యారు. విద్యుత్ స్తంభాలను కాలనీకి చేర్చారని, ఇంకా పాతలేదని ఆ సమావేశంలో స్థానికులు కుళ్లాయప్ప, షాహీదా తదితరులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. దీంతో ఎల్1, ఎల్2, ఎల్3 కాలనీలలో సిద్ధంగా ఉంచిన 50 విద్యుత్ స్తంభాలను ఆ శాఖ అధికారులు శుక్రవారం వీధుల్లో పాతడం ప్రారంభించారు. కాలనీ ప్రజలు ఆంధ్రజ్యోతి-ఏబీఎన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, పార్టీ నాయకురాలు తులసి, విద్యుత్ శాఖ ఏఈ వెంటేశ్ నాయక్, కాంట్రాక్టర్ శ్యామ్ సుందర్ రెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.



వేణుగోపాల్‌నగర్‌లో విద్యుత్ స్తంభాలు నాటుతున్న సిబ్బంది

అక్రమార్కులకు అగ్రిగోల్డ్

- సీఐడీ అటాచ్‌లో అగ్రిగోల్డ్ భూములు
- విలువైన భూముల ఆక్రమణకు యత్నం
- నకిలీ పత్రాలను సృష్టిస్తున్న కబ్జాదారులు



అగ్రిగోల్డ్ భూముల చుట్టు ఉన్న కాంపౌండ్ వాల్‌ను ధ్వంసం చేసిన ఆక్రమణదారులు

కూడేరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): అనంతపురం- బళ్లారి ప్రధాన రోడ్డుకు ఆనుకొని ఉన్న అగ్రిగోల్డ్ భూములు కాజేసేందుకు కొందరు కేటుగాళ్లు ప్రయత్నిస్తున్నారు. ఇక్కడ భూముల విలువ ఎకరం రూ. కోటికి పైగా ఉండటంతో దోచేయడానికి యత్నిస్తున్నారు. సీఐడీ అటాచ్‌లో ఉన్న ఈ భూములను రిజిస్ట్రేషన్ చేస్తున్నారా? లేక నకిలీ పత్రాలను సృష్టించి కాజేసేందుకు కుట్ర పన్నుతున్నారో అంతు చిక్కని రహస్యంగా మారింది.

మండలంలోని కమ్మూరు గ్రామ సమీపంలో దాదాపు 252 ఎకరాలు అగ్రిగోల్డ్ సంస్థ భూములున్నాయి. వైసీపీ పాలనలో కొందరు ప్లాట్లు కొన్నట్లు పత్రాలను సృష్టించుకోవడం, ప్లాట్లను శుభ్రం చేయడం, బాధితులు, సీపీఐ నాయకులు ఆందోళనలతో వెనుదిరగడం పరిపాటిగా మారింది. అగ్రిగోల్డ్ వెంచర్‌లో విలువైన సామగ్రిని దొంగలు ఎత్తుకెళ్లినా ఎవరు పట్టించుకోలేదు. గత ఏడాది నగరానికి చెందిన ఓ వైసీపీ నాయకుడు అర ఎకరం భూములు కొన్నానని, ఆక్రమించుకోవడానికి శుభ్రం చేస్తుండగా బాధితులు అడ్డుకున్నారు. రెవెన్యూ అధికారులకు సమాచారం అందించగా ఆక్రణదారుడు వెనక్కి తగ్గారు. విషయం తెలుసుకున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, తదితరులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను డిమాండ్ చేశారు. వారం కిందట రాజగోపాల్‌రెడ్డి, సాకే అబిజ్ఞ అగ్రిగోల్డ్ భూముల్లో ఉన్న వాచ్‌మన్ గదితోపాటు కాంపౌండ్ వాల్ రాత్రి సమయంలో ధ్వంసం చేసి ప్లాట్‌ను శుభ్రం చేశారు. ఇంత జరుగుతున్న రెవెన్యూ అధికారులు, పోలీసులు పట్టించుకోలేదు. శ్రీలక్ష్మి వెంకటేశ్వర గార్డెన్ డెవలపర్ పేరుతో 22 ఎకరాలు 2014లోనే రాజగోపాల్ రెడ్డి కొనుగోలు చేశారని, భూమి మొత్తం సీఐడీ అటాచ్‌లో ఉందని, 2023లో అబిజ్ఞ పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకొన్నట్లు పత్రాలను పుట్టించి ఆక్రమించుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

ఆక్రమణదారులు రాకుండా చర్యలు

అగ్రిగోల్డ్ భూముల్లో ఎవరైనా ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తీసుకుంటాం. వెంచర్‌లో ఉన్న భవనం కూల్చివేసిన వారి నుంచి వివరాలను సేకరిస్తున్నాం. సీఐడీ ఆధీనంలో ఉన్న అగ్రిగోల్డ్ భూముల్లో ప్లాట్లు కోర్టు ఆదేశాలుంటే పరిశీలిస్తాం. అంత వరకు ఎవరు ఆ భూముల్లోకి వెళ్లకూడదు.

- మహబూబ్‌బాషా, తహసీల్దారు కూడేరు

మళ్లీ.. నేల చూపులు..!

- వారంరోజులుగా తగ్గుముఖం పట్టిన టమోటా ధరలు
- దారుణంగా పడిపోతున్న వైనం
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు



కక్కలపల్లి మార్కెట్‌లోని మండీలకు వచ్చిన టమోటాలు

అనంతపురం రూరల్/ఆత్మకూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): టమోటా ధరలు నేలచూపులు చూస్తున్నాయి. కొన్నాళ్లుగా నిలకడగా సాగుతున్న ధరలు.. పతనస్థాయికి చేరుకుంటున్నా యి. వారం రోజులుగా ధరలు తగ్గుతున్నాయి. కొన్నేళ్లుగా టమోటా ధరలు రైతులకు చేదు అనుభవాలనే మిగిల్చాయి. నిలకడలేని ధరలతో దెబ్బతింటూనే ఉన్నారు. ధర పెరిగింది అనుకునేలోపు.. మళ్లీ తగ్గిపోవడంతో చాలా వరకు న ష్టాలనే చవిచూశారు. గిట్టుబాటు ధర కోసం రో డ్డెక్కిన సందర్భాలు లేకపోలేదు. గతేడాది ఘటనలే ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చు. నష్టాలను దిగమింగుకుని ఈ ఏటా రైతులు పంట పెట్టారు. ఈ సారి సాగు విస్తీర్ణం తగ్గినట్లు సంబంధింత వర్గాల ద్వారా తెలుస్తోంది. దీంతో సీజన్ ప్రారంభం నుంచి ధరలు నిలకడగా ఉం టున్నాయి. రెండు, మూడు నెలలపాటు ధరలు స్థిరంగానే పలికాయి. జిల్లాలోని టమోటా మార్కెట్ల నుంచి ఎగుమతి అయ్యే ప్రాంతాల్లో స్థానికంగా కాయలు మార్కెట్‌కు రాకపోవడం రైతులకు కలిసొచ్చింది. నిత్యం నష్టాలను చవిచూసిన రైతులు కొంత ఊరటనిచ్చాయి. ప్రస్తుతం పరిస్థితులు మళ్లీ మొదటికి తెస్తున్నాయన్నా భయం సంబంధిత వర్గాల్లో నెలకొంటున్నాయి. కొన్ని రోజులుగా ధరల్లో తగ్గుదల కనిపిస్తోంది. వారం రోజులుగా పరిస్థితి మరింతగా దిగజారుతోంది. ధరలు పతనస్థాయికి తీసుకెళ్తున్నాయి. దీంతో సంబంధిత వర్గాల్లో ఆందోళనలు రేగుతున్నాయి.

ప్రారంభంలో బాగున్నా..

టమోటా ధరలు సీజన్ ప్రారంభంలో బాగా పలికాయి. సీజన్ ప్రారంభం నుంచి కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో మేలిరకం కాయలు కిలో రూ.30 నుంచి రూ.35 మధ్య పలుకుతున్నాయి. గత నెలలో రూ.40 నుంచి రూ.47 వరకు పలికాయి. అంటే పదిహేను కిలోల బాక్సు రూ.600 నుంచి రూ.700 మధ్య అమ్ముడుపోయింది. సరాసరి గత రెండు, మూడు నెలలు 15కిలోల బాక్సు రూ.350 నుంచి రూ.400 పలికినట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది. ఈ క్రమంలో రైతులకు లాభాలను తెచ్చిపెట్టాయి. గత వారం రోజులుగా పరిస్థితులు మారిపోయాయి. కిలో రూ.25 లోపే పలుకుతున్నాయి. గురువారం ధరలు మరింత దిగజారిపోయాయి. కిలో గరిష్ఠ ధర రూ.15తో అమ్ముడుపోయాయి. దీంతో ధరను చూసి రైతులు ఆందోళన చెందుతున్నారు.

తగ్గుతున్న ఎగుమతులు..

జిల్లాలో ఆశించిన స్థాయిలో దిగుబడులు వస్తున్నాయి. ఎగుమతులు మందగించాయంటూ మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఆ ప్రభావం ప్రస్తుత ధరలపై పడుతోందంటున్నారు. జిల్లాలోని మార్కెట్ల నుంచి పక్క రాష్ట్రాలైన కర్ణాటక, తెలంగాణతోపాటు ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, మహారాష్ట్ర తదితర ప్రాంతాలకు టమోటా ఎగుమతి అవుతోంది. ప్రస్తుతం ఆయా మార్కెట్లకు స్థానికంగా కాయలు వస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ఎగుమతులు లేక ధరలు తగ్గుతున్నట్లు వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. జూలై, ఆగస్టు నెలల్లో జిల్లాలోని మార్కెట్లలో కాయలు కొనుగోలు చేసేందుకు వ్యాపారులు పోటీపడ్డారు. ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారిపోయిందని రైతులు అంటున్నారు. ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చిన కొందరు వ్యాపారులు సొంత ప్రాంతాలకు వెళ్లిపోతున్నట్లు తెలుస్తోంది. అమ్మకాలు తగ్గిపోవడంతో రెండు, మూడు బండ్లు లోడుచేసే వ్యాపారులు ఒకటికి చాలు అనేస్తున్నట్లు సమాచారం.

గత వారం రోజులుగా కక్కలపల్లి మార్కెట్‌లో టమోటా ధరల వివరాలు...

తేదీ	మార్కెట్‌కు వచ్చిన టమోటా (టన్నుల్లో.)	గరిష్ఠ ధర (కిలో రూ.)	సరాసరి ధర (కిలో రూ.)	కనిష్ఠ ధర (కిలో రూ.)
ఆగస్టు 29	3,225	23	19	14
ఆగస్టు 30	3,225	23	19	14
ఆగస్టు 31	3,000	25	19	14
సెప్టెంబరు 1	2,850	26	19	14
సెప్టెంబరు 2	3,000	23	18	14
సెప్టెంబరు 3	3,375	21	17	14
సెప్టెంబరు 4	3,075	15	13	10

కూలీల ఖర్చులు కూడా వచ్చేలా లేవు



రెండు విడతల్లో టమోటా సాగు చేశా. తొలి విడతలో ఎకరంలో పెట్టా. రెండవ విడతలో ఒకటిన్నర ఎకరాల్లో సాగు చేశా. పెట్టుబడులు భారీగానే వచ్చాయి. మొదటి కోతలో 60బాక్సులు అయ్యాయి. బాక్సు రూ.280, రెండో కోతలో వంద బాక్సులు రూ.200తో అమ్ముడుపోయాయి. మూడో కోత కోసి 180 బాక్సులు తీసుకొచ్చా. బాక్సు రూ.120తో అమ్ముడుపోయింది. ఖర్చులు, బాడుగలు, కమీషన్ ఇతరత్రా రూపాల్లో వచ్చిన ధరలో సగం మార్కెట్‌లోనే పోతోంది. ఈ ధరతో పంటకోసిన కూలీల ఖర్చులు కూడా దక్కేలా లేవు.

- రామన్న, దేవిరెడ్డిపల్లి, రాయదుర్గం మండలం

పెట్టుబడులైనా దక్కుతాయో.. లేదో..?



మూడు ఎకరాల్లో టమోటా సాగు చేశా. పెట్టుబడుల రూపంలో రూ.2లక్షలకుపైగానే ఖర్చు అయింది. ఇప్పటి వరకు ఐదు కోతలు కోశా. కొంత వరకు పెట్టుబడి వచ్చింది. పదిరోజులుగా ధరలు తగ్గిపోతున్నాయి. ధరల తగ్గుదల చూస్తుంటే భయమేస్తోంది. కనీసం పెట్టుబడులైనా దక్కుతాయో.. లేదో.. చూడాలి.

- ఎర్రిస్వామి, ఆత్మకూరు

మరుభూమిని సైతం..!

- ఆక్రమణల్లో ఎస్సీల శ్మశాన వాటిక
- ఇబ్బంది పడుతున్న మర్తాడు ఎస్సీలు



మర్తాడులో ఆక్రమణకు గురవుతున్న ఎస్సీల శ్మశాన వాటిక

గార్లదిన్నె, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ధరలు పెరగడంతో కబ్జాదారులు మరుభూమిని సైతం వదలకుండా ఆక్రమిస్తున్నారు. మండలంలోని మర్తాడు గ్రామంలో ప్రభుత్వం ఎస్సీలకు కేటాయించిన శ్మశాన వాటిక స్థలాన్ని ఆక్రమిస్తున్నారని గ్రామ ఎస్సీలు వాపోతున్నారు. గ్రామంలో సుమారు 500 ఎస్సీ కుటుంబాలు ఉన్నాయి. గ్రామానికి సమీపంలో రెండెకరాల స్థలంలో వీరికి శ్మశాన వాటికను ప్రభుత్వం కేటాయించింది. అయితే శ్మశాన వాటికకు దగ్గరల్లో ఉండే వారు కాలక్రమేణ ఈ స్థలం ఆక్రమించుకుంటూ ఇళ్లు నిర్మించుకుంటున్నారని గ్రామస్థులు ఆరోపి స్తున్నారు. ఎస్సీల శ్మశాన వాటికకు కేటాయించిన స్థలం ఆక్రమణకు గురికాకుండా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసిన ఫలితం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాగే వదిలేస్తే శ్మశాన వాటికను పూర్తిగా ఆక్రమించుకుంటారని ఆందోళన చెందుతున్నారు.

భద్రత కల్పించాలి : పెద్దన్న మర్తాడు



గ్రామంలో ఉన్న ఎస్సీలకు రెండెకరాల్లో శ్మశానవాటికను ప్రభుత్వం కేటాయించింది. గ్రామంలో ఎస్సీలు మృతి చెందితే అందులోనే అంత్యక్రియలు నిర్వహిస్తున్నాం. అయితే శ్మశాన వాటిక సమీపంలో ఉన్న వారు కొందరు శ్మశాన స్థలాన్ని ఆక్రమించుకుని ఇళ్లు కట్టుకున్నారు. అధికారులు స్పందించి ఎస్సీల శ్మశాన వాటిక ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలి.

ఫిర్యాదు చేసిన స్పందించలేదు



ఎస్సీల శ్మశాన వాటిక ఆక్రమణకు గురి అవుతోందని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసిన ఫలితం లేదు. ఇటీవల మర్తాడు ఎస్సీ కాలనీలో నిర్వహించిన పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశా. సర్వే చేయించి ఉపాధి హామీ ద్వారా శ్మశాన వాటికకు కంచె వేయిస్తామని తహసీల్దార్ చెప్పారు. సర్వే చేయిస్తే ఆర్డీటీ గ్రామ స్వరాజ్ నిధి ద్వారా శ్మశాన వాటికకు కంచె వేయించుకుంటాం.

- బూడిద కిష్ట, మర్తాడు

చురుగ్గా సూపర్ హిట్ పనులు

- సభాస్థలిని పరిశీలించిన మంత్రి కొల్లు
- హెలీప్యాడ్ ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

అనంతపురం క్రైం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ సూపర్ హిట్ బహిరంగ సభ నిర్వహణకు అనంతపురంలో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. జీఎంఆర్ గ్రౌండ్స్‌లో ఏర్పాట్లను ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర శుక్రవారం పరిశీలించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, అప్కాబ్ ఛైర్మన్ గండి వీరాంజినేయులు, ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ పూల నాగరాజు, అహుడా ఛైర్మన్ టీసీ వరుణ్, ఏడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి తదితరులతో కలసి సభాస్థలిని పరిశీలించారు. మ్యాప్ తెప్పించుకుని బహిరంగ సభ, హెలీ ప్యాడ్, పార్కింగ్ స్థలాల వివరాలను తెలుసుకున్నారు. సభ విజయవంతమయ్యేలా ఏర్పాట్లు చేయాలని నాయకులకు సూచించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు రామలింగారెడ్డి, గాజుల ఆదెన్న, నాగరాజు, నాయకులు గంగారామ్, సుధాకర్ యాదవ్, లక్ష్మీనరసింహ, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.



హెలీప్యాడ్ పనులను పరిశీలిస్తున్న సీఎం ప్రొగ్రామ్స్ కో ఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ, కలెక్టర్ వినోద్ కుమార్, ఎస్పీ జగదీష్, టీడీపీ రాష్ట్ర మీడియా కో ఆర్డినేటర్ బీవీ వెంకటరాముడు తదితరులు

హెలీప్యాడ్ వద్ద ఏర్పాట్లు

అనంతపురం-బెంగళూరు జాతీయ రహదారిలోని టాటా మోటార్స్ ఎదురుగా ఉన్న స్థలంలో రెండు హెలీప్యాడ్‌ల ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ పనులను ముఖ్యమంత్రి కార్యక్రమాల కో ఆర్డినేటర్, ఎమ్మెల్సీ మంతెన సత్యనారాయణ రాజు, కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీశ్, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, టీడీపీ రాష్ట్ర మీడియా కో ఆర్డినేటర్ బీవీ వెంకటరాముడు పరిశీలించారు. ఆ ప్రాంతంలో ఉన్న రేకుల షెడ్లు తొలగించాలని, మరో మట్టి లేయర్ వేసి, రోలింగ్ చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ కేశవనాయుడు, ఆర్అండ్‌బీ ఎస్ఈ మురళీకృష్ణ, ఈఈ రాజగోపాల్, డీఈ కాటమయ్య, తహసీల్దార్ హరికుమార్ పాల్గొన్నారు.



బహిరంగ సభ వేదిక పనులు చేస్తున్న కార్మికులు

బాలికపై అత్యాచారయత్నం

హిందూపురం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని ఓ కాలనీలో 13 ఏళ్ల బాలికపై అత్యాచారయత్నం జరిగింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన అనురదల్ల ఏడేళ్ల క్రితం ఓ వివాహితను తీసుకొచ్చి కలిసి ఉంటున్నాడు. ఆమె ఓ హోటల్‌లో పనిచేస్తుంటారు. ఇంట్లో లేని సమయం చూసి, ఆమె కూతురుపై అత్యాచారానికి యత్నించాడు. బాధిత బాలికను అనురదల్ల కొన్నాళ్లుగా వేధిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం మరోమారు బాలికపై అఘాయిత్యానికి ప్రయత్నించాడు. భయపడిన బాలిక, కేకలు వేస్తూ బయటకి పరుగులు తీసింది. విషయాన్ని తల్లి వచ్చాక చెప్పింది. ఆమె హిందూపురం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. నిందితుడు పరారయ్యాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శ్రీధర్ తెలిపారు.

బొట్టుపెట్టి పిలవండి

- ఇంటింటికీ వెళ్లి ఆడపడుచులను ఆహ్వానించండి
- టీడీపీ విస్తృత స్థాయి సమావేశంలో ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర
- వైసీపీ ఫేక్ ప్రచారం తిప్పికొట్టండి
- ఆప్కాబ్ ఛైర్మన్ గండి వీరాంజనేయులు
- బహిరంగ సభ విజయవంతం చేద్దాం: ఎమ్మెల్యే దగ్గుపాటి



పార్టీ శ్రేణులనుద్దేశించి మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

అనంతపురం క్రైం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): 'అనంతపురం అర్బన్‌లోని ప్రతి ఇంటికీ వెళ్లండి. ఆడపడుచులకు బొట్టుపెట్టి, సూపర్‌హిట్ సభకు ఆహ్వానించండి. అనంతపురం అర్బన్ నియోజక వర్గం నుంచే లక్ష మంది కదిలి రావాలి' అంటూ ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర టీడీపీ శ్రేణులకు సూచించారు. నగరంలోని మారుతీనగర్ సాయిబాబా గుడి కల్యాణ మండపంలో శుక్రవారం మధ్యాహ్నం అర్బన్ టీడీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వంతో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారన్నారు. అందుకే ఎన్నికల్లో కూటమి పార్టీలకు 175 స్థానాలకు 164 కట్టబెట్టారన్నారు. ఎన్నికల హామీ మేరకు కూటమి ప్రభుత్వం



హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

కొలువుదీరగానే పింఛన్‌ను రూ.4వేలకు పెంచామన్నారు. దివ్యాంగుల ఫించన్ రూ.3 వేల నుంచి రూ.6 వేలకు, బెడ్‌పై లేవలేని స్థితిలో ఉన్న వాళ్లకు రూ. 15 వేలు, దీర్ఘకాలిక జబ్బులతో ఉన్న వాళ్లకు రూ.10 వేలు ఇచ్చామన్నారు. ఏడాది కాలంలోనే పింఛన్ల కోసం రూ.35 వేల కోట్లు ఖర్చు చేసిన ప్రభుత్వం తమదేనన్నారు. మహిళలకు ఉచితబస్సు ప్రయాణం, అన్నదాత సుఖీభవన, తల్లికి వందనం 16,400 డీఎస్సీ పోస్టుల భర్తీ ప్రక్రియ ఇవన్నీ కూటమి ప్రభుత్వమే అందించిందని తెలిపారు. ఈ విషయాలన్నీ ప్రజలకు తెలిపేందుకు అనంతపురంలో సూపర్ సిక్స్ సూపర్ హిట్ సభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ మాట్లాడుతూ గత 44 ఏళ్లలో తొలిసారి అనంతపురంలో భారీ బహిరంగ సభ జరగబోతోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మనపై పెట్టిన బాధ్యతను విజయవంతంగా నిర్వహించాలన్నారు. 3.5 లక్షల మంది సభకు హాజరయ్యే అవకాశం ఉందన్నారు. టీడీపీ జోన్-5 ఇన్‌చార్జ్, గుంటూరు మేయర్ కోవెలమూడి రవీంద్ర మాట్లాడుతూ ఎన్నికల ముందు కష్టపడి కూటమిని గెలిపించారని, ఇప్పుడు ఈ విజయోత్సవ సభను సైతం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అర్బన్ పరిశీలకులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 11 సీట్లు ఇచ్చినా జగన్‌కు బుద్ధి రాలేదన్నారు. తిరుమల పవిత్రతను సైతం దెబ్బతియ్యాలని చూశాడని, ఆఖరికి టికెట్లు కూడా అమ్ముకున్నారంటూ మండిపడ్డారు. 10న జరిగే సభను విజయవంతం చేయాలని సూచించారు. అంతకు ముందు ఆప్కాబ్ ఛైర్మన్ గండి వీరాంజనేయులు మాట్లాడుతూ వైసీపీ నాయకుల ఫేక్ ప్రచారాలను టీడీపీ శ్రేణులు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ మాట్లాడుతూ ప్రతి కార్యకర్త ఈ కార్యక్రమాన్ని చాలెంజ్‌గా తీసుకుని విజయవంతం చేయాలని కోరారు. ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ పూల నాగరాజు మాట్లాడుతూ అనంతపురం ఉమ్మడి జిల్లా టీడీపీకి కంచుకోట అన్నారు. కార్యక్రమంలో లింగాయత్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ స్వప్న, టీడీపీ రాష్ట్ర, జిల్లా నాయకులు ఆదినారాయణ, బుగ్గయ్య చౌదరి, రాయల్ మురళి, జేయల్ మురళి, స్వామిదాస్, మదమంచి స్వరూప, డైరెక్టర్లు పీఎల్ఎన్ మూర్తి, పోతుల లక్ష్మీనరసింహులు, బొమ్మినేని శివ, పరమేశ్వర్, కొండన్న, నాయకులు సుధాకర్‌నాయుడు, చేపల హరి, సుధాకర్ యాదవ్, సింగవరం రవి, నెట్టెం బాలకృష్ణ, తేజస్విని, హరి తదితరులు పాల్గొన్నారు.


మహమ్మద్ ఇసాక్


జయచంద్ర


యాదవ అరుణ


ఉప్పరపల్లి శైలజ


బండి శ్రీనివాసులు


డాక్టర్ జీ కవిత


డాక్టర్ జీ ప్రభాకర్‌రావు


ప్రొఫెసర్ ఓం ప్రకాష్


ప్రొఫెసర్ శారద


ప్రొఫెసర్ ఈశ్వర్‌రెడ్డి

ఉత్తమ గురువులకు సత్కారం

పురస్కారాలను అందజేసిన సీఎం చంద్రబాబు

అనంతపురం రూరల్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): పాఠశాల, ఇంటర్, ఉన్నత విద్యా బోధనలో విశేష కృషి చేస్తున్న గురువులను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఘనంగా సత్కరించారు. విజయవాడలో జరిగిన గురుపూజోత్సవంలో రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను ప్రదానం చేశారు. జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల కెమికల్ ఇంజనీరింగ్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.శారద, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఓంప్రకాష్, కంప్యూటర్ సైన్స్ విభాగం ప్రొఫెసర్ బి. ఈశ్వర్‌రెడ్డి అవార్డులను అందుకున్నారు. కళ్యాణదుర్గం ఎస్‌వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆర్థికశాస్త్ర అధ్యాపకుడు శ్రీధర్, అనంతపురం గవర్నమెంట్ కాలేజీ అధ్యాపకుడు డాక్టర్ జి. ప్రభాకర్ రావు, బండ్లపల్లి జడ్పీ హైస్కూల్ టీచర్ మహమ్మద్ ఇసాక్, కోగిర జడ్పీ హైస్కూల్ టీచర్ జయచంద్ర, పామిడి ఏపీఎంఎస్ ప్రిన్సిపాల్ యాదవ అరుణ, ఆత్మకూరు జడ్పీ హైస్కూల్ టీచర్ ఉప్పరపల్లి శైలజ, అబ్బేదొడ్డి జడ్పీ హైస్కూల్ టీచర్ బండి శ్రీనివాసులు, శింగనమల ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. కవిత అవార్డును సీఎం, విద్యాశాఖ మంత్రి నుంచి అందుకున్నారు.

రేపు నేమకల్లు అంజన్న ఆలయం మూసివేత

బొమ్మనహాళ్, సెప్టెంబరు 5, (ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లు ఆంజనేయస్వామి దేవాలయాన్ని ఆదివారం మధ్యాహ్నం 1 గంట నుంచి మూసివేయనున్నట్లు ఆలయ అర్చకులు అనిల్‌కుమార్‌చార్యులు తెలిపారు. చంద్రగ్రహణం కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అర్చకులు తెలిపారు. మరుసటి రోజు ఉదయం సంప్రోక్షణ కార్యక్రమం చేపడతామన్నారు. అనంతరం సుప్రభాత, ప్రాత:కాల పూజలు నిర్వహించి స్వామి వారి దర్శనం కల్పిస్తామన్నారు.

'వైకుంఠం'కు వైరల్ ఫీవర్

అనంతపురం క్రైం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్నారు. కుటుంబికులు, టీడీపీ నాయకుల సమాచారం మేరకు మూడురోజుల కిందట ఆయనకు జ్వరం వచ్చింది. వ్యక్తిగత పనిమీద బెంగళూరుకు వెళ్లడంతో అక్కడి చల్లని వాతావరణం కారణంగా ఆయనకు మరింత ఇన్‌ఫెక్షన్ సోకింది. జలుబు, గొంతు నొప్పి, దగ్గు, జ్వరంతో తీవ్రంగా బాధపడుతున్నట్లు సమాచారం. వైరల్ ఫీవర్ నేపథ్యంలో బయట తిరగవద్దని వైద్యుల సూచనల మేరకు ఆయన ఇంట్లోనే విశ్రాంతి పొందుతున్నట్లు తెలిసింది.

స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం విద్య, కొత్తచెరువు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షకు ఈ నెల 30వ తేదీవరకు దరఖాస్తు చేసుకోవచ్చని డీఈఓ ప్రసాద్‌బాబు శుక్రవారం తెలిపారు. విద్యార్థి ఆధార్ కార్డులో ఉన్న విధంగా పేరు, పుట్టిన తేదీ, తండ్రి పేరు నమోదు చేయాలని సూచించారు. ఈ పరీక్ష రాయడానికి రాష్ట్రంలోని ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సౌకర్యం లేని ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాలలలో ఈ ఏడాది 8వ తరగతి చదువుతూ, ఏడాదికి రూ.3.50 లక్షల లోపు ఆదాయం ఉన్న కుటుంబాల విద్యార్థులు అర్హులని తెలిపారు. పరీక్ష రుసుము ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 ఆన్‌లైన్ అప్లికేషన్‌లో ఇచ్చిన ఎస్‌బీఐ లింక్ ద్వారా మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ పరీక్షలు ఈ ఏడాది డిసెంబరు 7వ తేదీన జరుగుతాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ సూచించారు. ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం ఏడాదికి రూ.12 వేలు చొప్పున ఐదేళ్లపాటు ఉపకార వేతనం అందిస్తుందని విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ లాజర్ తెలిపారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్‌ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో పాఠశాల డీఐఎస్‌ఈ నంబరుతో లాగిన్ కావాలని, ఆధార్ కార్డు ఆధారంగా వివరాలను నమోదు చేయాలని సూచించారు.

నంది విగ్రహం చోరీ


చోరీకి గురైన విగ్రహం ఇదే..

చెన్నేకొత్తపల్లి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముష్టికోవెల గ్రామ శివారులో ఉన్న ఐదు శతాబ్దాల పురాతన శివాలయంలో నందివిగ్రహం చోరీకి గురైంది. గుర్తుతెలియని దుండగులు గురువారం రాత్రి నందివిగ్రహాన్ని ఎత్తుకెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు. శుక్రవారం ఉదయం శివాలయంలో పూజలకు వెళ్లిన భక్తులు గమనించి విషయాన్ని గ్రామస్థులకు తెలియజేశారు. వారు అక్కడికి వెళ్లి పరిశీలించగా ఆలయ గర్భగుడికి ఎదురుగా ప్రతిష్ఠించిన ప్రధాన నంది విగ్రహాన్ని పెకలించడం గుర్తించారు. ఆస్థానంలో ఆలయంలోనే పక్కన ఉంచిన మరో చిన్న నంది విగ్రహాన్ని పెట్టి ప్రధాననంది విగ్రహాన్ని ఎత్తుకెళ్లినట్లు గమనించారు. గుప్తనిధుల కోసమే గుర్తుతెలియని దుండగులు ఆ పని చేసి ఉంటారనే అనుమానాలను వారు వ్యక్తం చేశారు. పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

విద్యార్థి అదృశ్యం

వజ్రకరూరు(ఉరవకొండ),సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలంలోని రాగులపాడు గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థి అదృశ్యమయ్యాడు. గుత్తి మండలం, బసినేపల్లి తండాకు చెందిన మహేష్ నాయక్ ఆ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. గురువారం రాత్రి 10 గంటల నుంచి కనిపించకపోవడంతో ఉపాధ్యాయులు ఆ విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. దీంతో శుక్రవారం ఆ విద్యార్థి తండ్రి రామాంజనేయులు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

ముదిగుబ్బ, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల సమీపంలో జరిగినట్లు ధర్మవరం రైల్వే పోలీసులు తెలిపారు. గురువారం రాత్రి దాదాపు 55 సంవత్సరాల వయసు కలిగిన ఓ పురుషుడు ముదిగుబ్బ-చెన్నేకుంటపల్లి రైల్వే స్టేషన్ల మధ్య జిల్లేడుబండ బ్రిడ్జి వద్ద రైలు కిందపడి మృతి చెందాడన్నారు. చామన ఛాయ గలిగిన మృతదేహంపై మెరూన్ రంగు టీ-షర్టు, నీలం, ఎరుపు రంగు కల లుంగీ ఉన్నాయన్నారు. మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 8978656463, 9951325345 నంబర్లకు సమాచారం అందించాలని ధర్మవరం రైల్వే పోలీసులు కోరారు.

చెరువులో జారిపడి విద్యార్థి ...


మైలార్ (ఫైల్)

రాయదుర్గం రూరల్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): స్నేహితులతో ఆడుకునేందుకు చెరువు వద్దకు వెళ్లి జారిపడి బాలుడు మైలార్(10) మృతి చెందిన సంఘటన మండలం ఆయతాపల్లి గ్రామంలో శుక్రవారం జరిగింది. స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన మేరకు శుక్రవారం పాఠశాలకు సెలవు కావడంతో మనోజ్ స్నేహితులతో కలిసి మధ్యాహ్నం చెరువు సమీపంలో ఆడుకునేందుకు వెళ్లాడు. ఆడుకుంటూ ప్రమాదవ శాత్తు చెరువులో కాలుజారి పడిపోయాడు. తోటి బాలురు ఈ విషయాన్ని కుటుంబసభ్యులకు తెలిపారు. వారు వెంటనే సంఘటనా స్థలానికి వెళ్లి నీటిలో ఉన్న బాలుడిని రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. గుమ్మఘట్ట మండలం ఎస్ కొత్తపల్లి గ్రామానికి చెందిన జయమ్మ, మల్లయ్య దంపతుల పెద్ద కుమారుడు మైలార్. అయితే ఆయతాపల్లి గ్రామంలో అమ్మమ్మ మారక్క వద్ద ఉంటూ ఆ గ్రామంలోని పాఠశాలలో నాలుగో తరగతి చదువుకునేవాడు.

వ్యక్తి అనుమానాస్పద మృతి


మృతిచెందిన నిఖిల్ కుమార్

హిందూపురం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నానెప్ప నగర్‌కు చెందిన నిఖిల్ కుమార్(32) శుక్రవారం ఉదయం అనుమానాస్పదంగా మృతిచెందాడని టూటౌన్ సీఐ అబ్దుల్ కరీం తెలిపారు. నిఖిల్ కుమార్ గురువారం వినాయక నిమజ్జనంలో పాల్గొన్నాడు. అతనితోపాటు మరో ఇద్దరు రహమత్‌పురంలోని ఓ ఏసీ గోదాము వద్దకు తెల్లవారు 3.30 గంటల సమయంలో వెళ్లి మద్యం సేవించినట్లు సీసీ ఫుటేజీలో కనిపించింది. తెల్లవారుజాము 4.40 గంటల వరకు వారు అక్కడే ఉన్నారు. ఆ తరువాత నిఖిల్ కుమార్ కిందకు పడిపోవడంతో వెంట వచ్చిన ఇద్దరు వెళ్లిపోవడం కనిపించింది. వీరు వేడుకల్లో ఎక్కువసేపు డీజే సౌండ్‌లో నృత్యం చేశారు. ఆ తరువాత మద్యం సేవించారు. అతని మృతికి కారణాలు ఏమిటో పోస్టుమార్టం నివేదిక వచ్చాక తెలుస్తుందని సీఐ అన్నారు. మృతునికి భార్య పావని, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మద్యానికి బానిసై.. ఆత్మహత్య

రాప్తాడు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని యర్రగుంట గ్రామానికి చెందిన కొడిగ సంజీవయ్య(31) విషం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. రాప్తాడు పోలీసులు తెలిపిన మేరకు, సంజీవయ్య మద్యానికి బానిస అయ్యాడు. డబ్బు కోసం భార్య గౌతమిని వేధించేవాడు. దీంతో పెద్ద మనుషులు పలుమార్లు పంచాయితీ చేశారు. అలవాటు మానుకోవాలని మందిలించినా సంజీవయ్యలో మార్పు రాలేదు. మద్యం తాగేందుకు డబ్బు కావాలని భార్యను కొట్టేవాడు. ఈ క్రమంలో శుక్రవారం ఇంట్లో ఉన్న విషం తాగి బాత్‌రూమ్‌లో పడిపోయాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అయినా ఫలితం లేకపోయింది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చీనీ టన్ను రూ.16వేలు

అనంతపురం రూరల్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా 16,500తో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.7వేలు, సరాసరి ధర రూ.12వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 753 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.


ఇదేదో.. ఇంటి సామగ్రి వేసుకునే షెడ్డు అనుకుంటే పొరబాటే. చిలమత్తూరు మండలంలోని వెంకటాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల. నాలుగేళ్ల క్రితం అప్‌గ్రేడ్ చేశారు. దాతలు నాలుగు షెడ్లు కట్టించారు. వాటిలోనే పాఠశాల నిర్వహిస్తున్నారు. వర్షం వస్తే షెడ్లు కారుతుండడంతో మొత్తం నీరు చేరుతోంది. తరగతులు నిర్వహించలేని దుస్థితి దాపురిస్తోంది. గత ప్రభుత్వం నాడు-నేడు అంటూ ప్రగల్భాలు పలికింది. ఒక్క గది కూడా కట్టలేకపోయింది.


ఇది వెంకటాపురం ఉన్నత పాఠశాలలోని ఓ తరగతి గది. కాదు.. కాదు.. చిన్న షెడ్డు. ఇందులో ఏడు, ఎనిమిది తరగతులు నిర్వహిస్తున్నారు. ఒక టీచరు మాత్రమే బోధించే అవకాశం ఉంది. ఏడో తరగతికి పాఠం చెబుతుంటే.. ఎనిమిదో తరగతి వారు ఖాళీగా కూర్చోవాల్సిందే. ఎనిమిదో తరగతి వారికి బోధిస్తుంటే.. ఏడో తరగతి విద్యార్థులు ఖాళీగా ఉండాల్సిందే.

చిన్న షెడ్లలో పెద్దబడి

- అప్‌గ్రేడ్ పాఠశాలలో మౌలిక సదుపాయాలు నిల్
- వేధిస్తున్న తరగతి గదుల కొరత
- కంకర తేలిన మైదానంలో ప్రమాదాలు


అర్ధాంతరంగా ఆగిపోయిన భవన నిర్మాణాలు

చిలమత్తూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి):మండలంలోని వీరాపురం పంచాయతీ వెంకటాపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పురిటిలోనే పుట్టెడు సమస్యలను ఎదుర్కొంటోంది. గ్రామంలో ఏళ్లుగా ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలను 2021లో అప్‌గ్రేడ్ చేశారు. పది వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. మండల కేంద్రానికి వీరాపురం పంచాయతీలోని గ్రామాలు సుమారు 10 నుంచి 12 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. దాంతో ఆయా గ్రామాల్లో ఉన్న పేద విద్యార్థులు ఉన్నత చదువుల కోసం చిలమత్తూరుకు రాలేక బడి మానేస్తున్నారు. వీరాపురం పంచాయతీ వెంకటాపురం గ్రామంలో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలను ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేయడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సంతోషించారు. వెంకటాపురం గ్రామంలో పాఠశాలను విస్తరించడానికి తగినంత స్థలం లేకపోవడంతో లక్ష్మీపురం-వెంకటాపురం గ్రామాల మధ్య సుమారు 7 ఎకరాల్లో పాఠశాలను ఏర్పాటుచేశారు. పాఠశాల అప్‌గ్రేడ్ అయినప్పటి నుంచి సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. కనీస సదుపాయాలు కరువవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలో 50 ఉన్న విద్యార్థుల సంఖ్య అప్‌గ్రేడ్ చేయగానే ఒక్కసారిగా 127కి పెరిగింది. ఉన్నత పాఠశాలగా మారడంతో ఆదెప్పల్లి, ఆదెప్పల్లి తండా, హసేన్‌పురం, భూపసముద్రం, లక్ష్మీపురం, వెంకటాపురం, వీరాపురం, దాదిరెడ్డిపల్లి, దాదిరెడ్డిపల్లి తండా నుంచి విద్యార్థులు క్యూకట్టారు. ఏటా విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నా పాఠశాలలో మౌలిక సదుపాయాలు మాత్రం కల్పించట్లేదు. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక పాఠశాల అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. భవనాల నిర్మాణానికి ఎమ్మెల్యే రూ.కోటి మంజూరు చేయడంతో పనులు చేపడుతున్నారు.

సదుపాయాలు కరువు

పాఠశాలను అప్‌గ్రేడ్ చేయడంతో కొందరు దాతలు తాత్కాలిక షెడ్లను ఏర్పాటు చేశారు. అవి కూడా నాలుగే ఉండడంతో మరో తరగతికి గది లేదు. షెడ్లు నాణ్యతగా లేకపోవడంతో వర్షం వస్తే కారి, నిండిపోతున్నాయి. ఆరుబయట పాఠాలు చెప్పలేక టీచర్లు.. ఒకే గదిలో రెండు తరగతులకు బోధిస్తున్నారు. ఆటస్థలం కరువైంది. పాఠశాల ఆవరణం పూర్తిగా వ్యవసాయ భూమి కావడంతో నేల మొత్తం కంకర రాళ్లతో ఉంది. దాంతో విద్యార్థులు ఆడుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్, తాగునీరు వంటి కనీస సదుపాయాలు కూడా లేవు.

ఎమ్మెల్యే చేయూత

పాఠశాలలో మౌలిక సదుపాయాలు, తరగతి గదుల కొరతను ఎమ్మెల్యే బాలకృష్ణ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించారు. వెంటనే ఎమ్మెల్యే పీఏ వీరయ్యతో మాట్లాడి పాఠశాల అభివృద్ధికి నివేదికలు పంపాలని ఆదేశించారు. ఆ మేరకు ఆయన నివేదిక ఇవ్వడంతో ఆగమేఘాల మీద పాఠశాలలో నూతన భవనాల నిర్మాణానికి సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.కోటి మంజూరు చేయించారు. దాంతో పాఠశాలకు మహర్దశ వచ్చినట్లయింది. భవనాల నిర్మాణం కూడా ప్రారంభించారు. ఆ పనులు కూడా నాలుగు నెలలుగా ఆగిపోవడం శోచనీయం.

ఉపాధ్యాయుల కృషి అభినందనీయం

వెంకటాపురం పాఠశాల అభివృద్ధికి టీచర్లు పాటుపడుతున్నారు. మౌలిక సదుపాయాలను సొంత డబ్బులతో ఏర్పాటు చేసుకుంటున్నారు. విద్యార్థులకు ఆటస్థలాన్ని చదును చేయించారు. మొక్కలు పెంచుతున్నారు. తాగునీటి సౌకర్యం కల్పించుకున్నారు. పాఠశాలలో పనిచేస్తున్న 11 మంది టీచర్లు సొంత డబ్బులు వెచ్చించి తరగతి గదిని నిర్మిస్తున్నారు.

ఆట స్థలం మొత్తం కంకర రాళ్లే



పాఠశాలకు ఆటస్థలం లేదు. పాఠశాల ముందు భాగంలో ఖాళీ స్థలం ఉన్నా.. అది కంకర రాళ్లతో నిండి ఉంది. దాంతో అడుగు పెట్టాలంటే ఇబ్బందిగా మారింది. దీంతో ఆటలకు దూరం అవుతున్నాం. ఆటస్థలాన్ని బాగుచేయాలి.

- బాలాజీ, విద్యార్థి

సదుపాయాల కొరత



పాఠశాల అప్‌గ్రేడ్ కావడంతో చాలా సంతోషించాం. మరోచోట నిర్మించాల్సి రావడంతో తరగతి గదులు, మౌలిక సదుపాయాల కొరత తలెత్తింది. ఎమ్మెల్యే బాలకృష్ణకు సమస్యను విన్నవించగా.. పాఠశాలకు శాశ్వత భవనాల నిర్మాణానికి రూ.కోటి మంజూరు చేశారు. అనివార్య కారణాలతో భవనాల నిర్మాణం ఆగిపోయింది. ఇప్పుడు పిల్లలకు బోధన ఎలా చేయాలో అర్థం కావడం లేదు. గదుల కొరత కారణంగా పదో తరగతి విద్యార్థులు పాఠశాలకు రావడం లేదు.

- జనార్దన్, పాఠశాల హెచ్‌ఎం, వెంకటాపురం

సోషలిజంతోనే సంపూర్ణ స్వాతంత్ర్యం

రాజ్యాంగం, లౌకికతత్వ పరిరక్షణే ఎర్ర జెండా లక్ష్యం

సీతారాం ఏచూరి వర్ధంతి సభలో రాంభూపాల్


మాట్లాడుతున్న రాంభూపాల్

అనంతపురం టౌన్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): సోషలిజంతోనే దేశానికి సంపూర్ణ ప్రజా స్వాతంత్ర్యం వస్తుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ అన్నారు. సమాజంలో దోపిడీ, వివక్ష, పెట్టుబడిదారీ, భూస్వామ్య వ్యవస్థలను రూపుమాపి, సమానత్వం, ప్రజలందరికీ కూడు, గూడు, గుడ్డను అందించేలా సోషలిస్టు దేశాన్ని స్థాపించుకున్నపుడే ప్రజలకు సంపూర్ణమైన స్వాతంత్ర్యం వచ్చినట్లవుతుందని అన్నారు. సీపీఎం అఖిల భారత మాజీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ విగ్రహం వద్ద సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సభలో రాంభూపాల్ మాట్లాడారు. దేశంలో మతతత్వం, కార్పొరేట్, ప్రైవేటీకరణ, దోపిడీ వ్యవస్థల నిర్మూలనకు ఎర్ర జెండాను ఆయుధంగా చేసుకుని సీతారాం ఏచూరి పోరాటాలు చేశారని గుర్తు చేశారు. ఆయన తుదిశ్వాస వరకూ ప్రజల పక్షాన గొంతెత్తి పోరాడిన మహనీయుడని అన్నారు. ప్రస్తుతం దేశంలో మోదీ ప్రభుత్వం కార్పొరేట్, ప్రైవేటీకరణ విధానాలు అమలు చేస్తూ.. రాజ్యాంగం, లౌకికతత్వాన్ని ఆటంకపరుస్తోందని విమర్శించారు. యువత భవిష్యత్తు అంధకారంగా తయారైందని అన్నారు. సాఫ్ట్‌వేర్ రంగం కుదేలై.. ఉద్యోగాలు లేక ఉపాధిని కోల్పోయి రోడ్డున పడుతున్నారని తెలిపారు. ఎన్నికల కమిషన్ భ్రష్టు పట్టిపోయిందని అన్నారు. ఆంధ్రుల ఆత్మాభిమానానికి ప్రతిబింబంగా నాడు ఎన్టీఆర్ నిలిచిన గొప్ప చరిత్ర రాష్ట్రానికి ఉందని అన్నారు. ట్రంప్ తన స్నేహితుడని గొప్పలు చెప్పుకునే మోదీ.. ఎర్రజెండా మోస్తున్న కమ్యూనిస్టులను చైనా కుక్కలని నాడు హేళన చేశారని, అదే మోదీ కమ్యూనిస్టు దేశాలైన చైనా, రష్యా అధ్యక్షులను కలిశారని, ఇచ్చిపుచ్చుకునే సంప్రదాయం కొనసాగిద్దామనే నూతన అధ్యాయం ఆరంభించారని అన్నారు. సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతిని రాష్ట్ర వ్యాప్తంగా వారంరోజులపాటు వాడవాడలా నిర్వహిస్తున్నామని సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప తెలిపారు. పాలకుల అస్తవ్యస్థ విధానాలను ప్రజలకు తెలియజేసేందుకు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాలరంగయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా నాయకులు మన్నీల రామాంజనేయులు, ముర్తుజా, వెంకటనారాయణ, వలి, ప్రకాష్, ఇర్ఫాన్, మసూద్, గోపాల్, జీవా, ఓబులేసు, లక్ష్మీనరసమ్మ, లక్ష్మినారాయణ, రాజు, గఫూర్, వెంకట్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

వెలుగు జ్యోతులు అధ్యాపకులు

జేఎన్‌టీయూఏ వీసీ సుదర్శన్‌రావు


సర్వేపల్లి విగ్రహం వద్ద వీసీ, రిజిస్ట్రార్ తదితరుల నివాళి

అనంతపురంరూరల్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): అధ్యాపకులు దేశానికి వెలుగు చూపే జ్యోతులని, విద్యార్థులను బాధ్యతయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడంలో వీరే కీలక పాత్ర పోషిస్తున్నారని జేఎన్‌టీయూఏ వీసీ సుదర్శన్‌రావు అన్నారు. వర్సిటీలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ఆవరణలో ఉన్న సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్‌లో సర్వేపల్లి చిత్రపటానికి వీసీ సుదర్శన్‌రావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య, ఓఎస్‌డీ దేవన్న తదితరులు నివాళులు అర్పించారు. వీసీ మాట్లాడుతూ విద్యార్థుల్లో వ్యక్తిత్వం వికసించడానికి, విద్యాపరమైన విజయాలకు క్రమశిక్షణయుతమైన బోధన కీలకమైందన్నారు. ఈక్రమశిక్షణ బోధించి విద్యార్థులను తీర్చి దిద్దడంలో టీచర్ల పాత్ర అమోఘమైందన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు సత్యనారాయణ, భానుమూర్తి, వైశాలిఘోర్పడే, నాగప్రసాద్‌నాయుడు, కిరణ్మయి, సురేష్‌బాబు, దుర్గాప్రసాద్, శోభిబిందు, సుజాత, శివకుమార్, ఏటీపీఆర్‌ఐ డైరెక్టర్ సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వసుంధర పాల్గొన్నారు. ఓటీపీఆర్‌ఐలో కూడా ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. సంస్థ సంచాలకులు జీవీ సుబ్బారెడ్డి తదితరులు సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గోపినాథ్, డిప్యూటి రిజిస్ట్రార్ దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

- మరో ఇద్దరికి తీవ్రగాయాలు

నల్లమాడ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండ్రవారిపల్లికి చెందిన రంగస్వామినాయుడు(56) శుక్రవారం తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు బంధువులు, గ్రామస్థులు తెలిపారు. ఇదే ప్రమాదంలో మృతుడి భార్య ఆదిలక్ష్మి, ఎస్ క్రిష్టప్ప తీవ్రంగా గాయపడినట్లు చెప్పారు. రంగస్వామినాయుడు, క్రిష్టప్ప ఇద్దరు కలిసి గత ఏడేళ్లుగా మామిడి, జామ తోటలు కొనుగోలు చేసి, పండ్ల వ్యాపారం చేస్తున్నారు. మృతుడు రంగస్వామినాయుడు కుమారుడి వివాహం నిమిత్తం పది రోజుల కిందట స్వగ్రామానికి వెళ్లారు. పెళ్లి కార్యక్రమం ముగించుకుని, గురువారం రాత్రి రంగస్వామినాయుడు, ఆదిలక్ష్మి, క్రిష్టప్ప రైలులో తెలంగాణాకు వెళ్లారు. రైల్వే స్టేషన్ నుంచి తాము నివాసమున్న ప్రాంతానికి వెళ్లడానికి కడతాల్ బస్టాప్ వద్ద బస్సు కోసం వేచి ఉండగా ప్రమాదవశాత్తు కారు ఢీకొట్టింది. ఈప్రమాదంలో రంగస్వామి నాయుడు దూరంగా ఎగిరిపడ్డాడు. మిగిలిన ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ ఆదిలక్ష్మిని, క్రిష్టప్పను సమీపంలోని ఆసుపత్రికి తరలించాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసి రంగస్వామినాయుడును ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

టమోటా కిలో రూ.15

అనంతపురం రూరల్, సెప్టెంబరు5 (ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో శుక్రవారం కిలో టామోటాలు గరిష్ఠంగా రూ.15తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదే విధంగా కనిష్ఠ ధర రూ.9, సరసరి ధర రూ.12తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 3,600 టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

రోషిరెడ్డికి మంత్రి అభినందనలు



పారా క్రీడాకారుడు రోషిరెడ్డిని అభినందిస్తున్న మంత్రి రామ్‌ప్రసాద్ రెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఇటీవల తమిళనాడులోని కోయంబత్తూర్‌లో నిర్వహించిన 4వ జాతీయ పారా త్రోబాల్ చాంపియన్‌షిప్-2025 పోటీల్లో ఆంధ్రా పారా త్రోబాల్ జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించి సత్తా చాటిన జిల్లా క్రీడాకారుడు రోషిరెడ్డిని రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్ రెడ్డి రాజధాని అమరావతిలోని తన కార్యాలయంలో శుక్రవారం అభినందించారు. ఫైనల్‌లో జార్ఖండ్‌తో జరిగిన మ్యాచ్‌లో రెండు సెట్లతో జట్టును గెలిపించిన రోషిరెడ్డి ట్రోఫీ సాధించడంలో కీలకపాత్ర పోషించాడు. ఇందుకు పారా స్పోర్ట్స్ ఆంధ్రప్రదేశ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గోనుగుంట్ల కోటేశ్వరరావు, రామస్వామితో పాటు జట్టు సభ్యులకు మంత్రి అభినందనలు తెలిపారు.

'తాడిపత్రి ఘటనలకు బాధ్యులెవరు?'

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే అత్యంత వివాదాలు, సమస్యలు, అరాచకాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన తాడిపత్రి ఘటనల కు బాధ్యులు ఎవరని.. రిజర్వేషన్ల పరిరక్షణ సమితి వ్యవస్థాపకుడు నాగరాజు ప్రశ్నించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆయన భారతదేశంలోనే మొదటి మహిళా ఉపాధ్యాయురాలు అయిన సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఫ్యాక్షన్ చరిత్ర కలిగిన ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు ఆధిపత్యం కోసం గత కొన్నేళ్ల నుంచి ముఠాలుగా ఏర్పడి తాడిపత్రిలో బీభత్సం సృష్టిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వాపోయారు. ఆ ఇద్దరినీ పార్టీల నుంచి బహిష్కరించాలని టీడీపీ, వైసీపీ అధిష్టానాలకు లేఖ రాసినట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో బీసీ, ఎస్సీ, మైనార్టీ అభ్యర్థులకు ఆయా రాజకీయ పార్టీలు టికెట్లు కేటాయించి సమస్యకు పరిష్కారం చూపాలని సూచించారు. అలాగే దేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు అయిన సావిత్రిబాయి పూలే పేరుతో ఉపాధ్యాయ దినోత్సవం జరపాలని, ఆమె పేరుతో అవార్డు ప్రకటించాలని ఆయన కోరారు.

ఆ వీఆర్వోపై చర్యలు తీసుకోవాలి: సీపీఐ

బుక్కరాయసముద్రం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ యూనివర్సిటీ సమీపంలో కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన అప్పటి వీఆర్వో కుమారస్వామిపై వెంటనే చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాణ్యం నారాయణస్వామి డిమాండ్ చేశారు. మండలంలోని జంతులూరు గ్రామం వద్ద ఉన్న సర్వే నం-276లో 5 ఎకరాల భూమిని శుక్రవారం ఆయన నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. ఈ భూమిలో వెంటనే దళితులకు ఇంటి పట్టాలు ఇవ్వాలని, కబ్జాకు పాల్పడిన అప్పటి వీఆర్వోపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెంటనే జిల్లా రెవెన్యూ అధికారులు కోట్ల విలువ చేసే భూమిని అన్యాక్రాంతం కాకుండా కాపాడాలన్నారు. లేకపోతే... ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి నారాయణస్వామి, మండల సీపీఐ కార్యదర్శి బండిరామక్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ కళాశాలలో ప్లేస్‌మెంట్ డ్రైవ్



ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో పాల్గొన్న విద్యార్థులు

అనంతపురం రూరల్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ప్లేస్ మెంట్ డ్రైవ్ నిర్వహించారు. సివిల్ మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు ఈఫిల్ టెక్ సొల్యూషన్ కంపెనీ క్యాంపస్ డ్రైవ్ చేపట్టారు. మొత్తం 97మంది విద్యార్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. అందులో 65మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. అనంతరం వారిని ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర, ఈఫిల్ టెక్ సొల్యూషన్ డైరెక్టర్ కిషోర్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ రాజేష్, హెచ్‌ఓడీలు ప్రదీప్‌కుమార్, రాజేష్‌కుమార్ అభినందించారు.


పి.యాలేరు సొసైటీ చైర్మన్ బాధ్యతల స్వీకరణ



చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న కృష్ణమోహన్ చౌదరి

ఆత్మకూరు సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని పి. యాలేరు సొసైటీ చైర్మన్‌గా గడుపూటి కృష్ణమోహన్ చౌదరి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సొసైటీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ఏడీసీసీబీ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, రాప్తాడు మార్కెట్ యార్డు చైర్మన్ సుధాకర్ చౌదరి, డీసీఎంఎస్ చైర్మన్ నెట్టం వెంకటేశులు ముఖ్యఅతిథులుగా హాజరై ఆయన్ను అభినందించారు. అనంతరం మాట్లాడుతూ.. దాదాపు 30 ఏళ్ల తరువాత ఈ సొసైటీకి విముక్తి కలిగిందన్నారు. ఎమ్మెల్యే పరిటాల సునీత చొరవతో సొసైటీకి కొత్తచైర్మన్ రావడం సంతోషంగా ఉందన్నారు. సొసైటీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కృష్ణమోహన్ చౌదరి తెలిపారు. రైతులకు మెరుగైన సేవలందిస్తానన్నారు. అనంతరం ఆయనతో పాటు డైరెక్టర్లు నారాయణప్ప, బొమ్మయ్యను టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో సన్మానించారు. జిల్లా నాయకులు అనిల్ చౌదరి, మండల కన్వీనర్ శ్రీనివాసులు, టీఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి పరుశురాం, మండల ప్రధానకార్యదర్శి నరసింహ చౌదరి, ముట్టాల సొసైటీ చైర్మన్ లింగన్న, ఎంపీటీసీ సభ్యురాలు పారిజాతమ్మ, మండల నాయకులు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజలో పాల్గొన్న గ్రామస్థులు

రామగిరి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరూరు గ్రామంలో లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి గ్రామస్థుల ఆధ్వర్యంలో శుక్రవారం భూమి పూజ ఘనంగా జరిగింది. గ్రామానికి చెందిన తిమ్మారెడి రూ.30సెంట్ల స్థలం విరాళంగా ఇవ్వడంతో అందులో టీటీడీ నిధులతో ఆలయ నిర్మాణం చేపట్టడానికి భూమిపూజ చేశారు. తిమ్మారెడ్డి దంపతులు, పోలీసు ముత్యాలప్ప దంపతులు పూజలో పాల్గొనగా.. వేదపండితులు వేదమంత్రోచ్ఛారణల నడుమ భూమి పూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో పేరూరు సాగునీటి సంఘం చైర్మన్ లక్ష్మీనారాయణ రెడ్డి, సింగిల్‌విండో మాజీ చైర్మన్ వెంకటేశ్, టీడీపీ నాయకులు చెన్నయ్య, వడ్డిసుబ్బ, వడ్డిహనుమంతు, మాదన్న, వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో విద్యకు అధిక ప్రాధాన్యం

- ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ
- కొర్రపాడులోని అంబేడ్కర్ బాలికల రెసిడెన్షియల్ స్కూల్లో మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం
- పాల్గొన్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

బుక్కరాయసముద్రం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తోందని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని కొర్రపాడు గ్రామం వద్ద ఉన్న అంబేడ్కర్ బాలికల రెసిడెన్సియల్ పాఠశాలలో రూ.5లక్షల ఎంపీ నిధులతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను శుక్రవారం ఆయనతో పాటు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. తర్వాత ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులందరూ బాగా చదువుకుని ఉన్నత భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. విద్యకు ప్రాధాన్యతలో భాగంగా మంత్రి నారాలోకేష్ విద్యార్థులకు తల్లికి వందనం, డొక్కాసీతమ్మ భోజన పథకంతో పాటు యూనిఫాంలు, పుస్తకాలు, షూతో పాటు అన్ని రకాల సదుపాయాల కల్పించారని తెలిపారు. ప్రైవేటు పాఠశాలలుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యతమైన విద్యను అందిస్తున్నట్లు చెప్పారు. ఈ పాఠశాలలో తాగునీటి సమస్య ఉందని తమ దృష్టికి వచ్చిన వెంటనే మినరల్ నీటి ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే శ్రావణిశ్రీ మాట్లాడుతూ గత వైసీపీ హయంలో ఈ పాఠశాలను భ్రష్టుపట్టించారన్నారు. అప్పటి ప్రిన్సిపాల్ అవినీతి చేయడంతో అభివృద్ధికి నోచుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పాఠశాలలో అన్ని సమస్యలను దశలవారిగా పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సునీత, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్‌బాబు, ఎంపీపీ సునీత, నాయకులు పసుపుల శ్రీరామిరెడ్డి రవీంద్ర, ఓబుళపతి, బోయ ఆది, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బినామీలకు కట్టబెట్టేందుకే మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ

- వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి



మాట్లాడుతున్న అనంత వెంకటరామి రెడ్డి

అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు తన బినామీలకు, అనుచరులకు కట్టబెట్టేందుకే మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తున్నారని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ఆరోపించారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి అధికారంలోకి వచ్చాక ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేస్తోందన్నారు. చంద్రబాబు తన క్యాబినెట్‌లో విద్యాసంస్థలు నడుపుతున్న వారికి మెడికల్ కళాశాలలను ధారాదత్తం చేయడానికి ప్రయత్నం చేస్తున్నారన్నారు. పులివెందుల మెడికల్ కళాశాలకు మంజూరైన అనుమతులను కూడా ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. వెంటనే క్యాబినెట్ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలోనే మెడికల్ కళాశాలలు నిర్వహించాలన్నారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని బీమా కిందకు తీసుకొస్తే పేద, మధ్య తరగతి ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన నిర్ణయాలను మార్చుకోకపోతే ప్రజా సంఘాలు, ఇతర పార్టీలతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. కూటమి పాలనలో రైతాంగం పరిస్థితి అయోమయంగా మారిపోయిందన్నారు. రైతాంగం సమస్యలపై ఈనెల 9న అన్ని రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో నిరసన ర్యాలీలు చేపట్టి ఆర్డీఓలకు వినతిపత్రాలు అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

సభను సక్సెస్ చేయండి

శింగనమల, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): సూపర్‌సిక్స్- సూపర్‌హిట్ బహిరంగ సభను విజయ వంతం చేయాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పిలుపునిచ్చారు. జిల్లాకేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆమె నియోజకవర్గ టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈనెల 10 తేదీన అనంతపురంలో జరిగే సూపర్‌సిక్స్-సూపర్‌హిట్ బహిరంగసభకు సీఎం చంద్రబాబు ,డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తదితరులు రానున్నట్లు తెలిపారు. నియోజకవర్గం నుంచి భారీ ఎత్తున కార్యకర్తలు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆ పదవులు రాయలసీమ బెస్తలకే కేటాయించాలి

అనంతపురం ప్రెస్‌క్లబ్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : బెస్త కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్ల పదవులను రాయలసీమ ప్రాంత బెస్తలకే కేటాయించి ఆదుకోవాలని బెస్త సేవాసంఘం నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం జిలాకేంద్రానికి వచ్చిన ఎక్సైజ్, గనులశాఖ మంత్రి కొల్లు రవీంద్రను కలిసి వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ మాట్లాడుతూ.. రాయలసీమ జిల్లాల్లో బెస్తయేతరకులాలు, వివిధ పార్టీలకు చెందిన స్థానిక నాయకులు, దళారీలు మత్స్య సంఘాలు, నీటి వనరులపై ఆధిపత్యం చలాయిస్తూ బెస్తలకు అన్యాయం చేస్తున్నారన్నారు. తద్వారా బెస్తలు వృత్తిరీత్యా ఉపాధి కోల్పోతున్నారన్నారు. బెస్త కార్పొరేషన్ చైర్మన్ పదవిని పట్టపు కులస్థులకు కట్టబెట్టారన్నారు. వెంటనే పట్టపుకులానికి చెందిన బొమ్మన శ్రీధర్‌కు బెస్త కార్పొరేషన్ చైర్మన్ పదవిని రద్దు చేసి రాయలసీమలోని బెస్త కులస్థులకు ఇవ్వాలని కోరారు. సంఘం నాయకులు చంద్రబాబు, నాగేంద్రకుమార్, హరినాథ్‌బాబు, చేపల హరి, శంకర్, వెంకీ, జశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

'రైతుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తా'



దండు శ్రీనివాసులును సన్మానిస్తున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

శింగనమల, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తానని శింగనమల మార్కెట్ యార్డు చైర్మన్ దండు శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆయన్ను మార్కెట్ యార్డు చైర్మన్‌గా ప్రభుత్వం గురువారం నియమించడంతో శుక్రవారం నియోజకవర్గం నుంచి టీడీపీ కార్యకర్తలు,నాయకులు అనంతపురంలో నివాసం వద్దకు పెద్దఎత్తున తరలివచ్చి అభినందనలు తెలిపారు. తర్వాత దండు శ్రీనివాసులు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ నివాసం వద్దకు వెళ్లి ఆమెకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానం చేశారు. ఎమ్మెల్యే కూడా ఆయన్ను సన్మానించి అభినందించారు. తర్వాత మాట్లాడుతూ టీడీపీలో కష్టపడిన ప్రతి కార్యకర్తలకు తప్పక గుర్తింపు లభిస్తుందని తెలిపారు.

శాస్త్రీయ జ్ఞానాన్ని పెంపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

- జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్



మాట్లాడుతున్న డాక్టర్ గేయానంద్

అనంతపురంటౌన్, సెప్టెంబరు5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు శాస్త్రీయ జ్ఞానాన్ని అందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని మాజీ ఎమ్మెల్సీ జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్ పేర్కొన్నారు. స్థానిక జేవీవీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఉపాధ్యాయులు శాస్త్రీయ దృక్పథంతో బోధించే బోధనలే సమాజంలో మార్పులు తీసుకురాగలవని, అలాంటి మార్పులే దేశాభివృద్ధికి దోహదపడతాయని తెలిపారు. జేవీవీలో పనిచేస్తున్న టీచర్లందరూ ఆ దిశగా కృషి చేయాలన్నారు. సమాజంలో జరుగుతున్న పరిణామాలకు, బోధిస్తున్న పాఠాలకు పోలిక లేకపోవడం వల్ల ప్రస్తుత విద్యార్థులు సతమతమవుతున్నారన్నారు. దానిని సరిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట ఆడిట్ కమిటీ కన్వీనర్ సాకే భాస్కర్, జేవీవీ జిల్లా అధ్యక్షుడు చిత్తప్ప, రాష్ట్ర కమిటీ సభ్యుడు లక్ష్మీనారాయణ, జిల్లా గౌరవాధ్యక్షురాలు డాక్టర్ ప్రసూన, ఆడిట్ కమిటీ కన్వీనర్ శ్రీనివాసులు, సమత జిల్లా కన్వీనర్ రాధా, జేవీవీ జిల్లా నాయకులు గాంగే నాయక్, అర్జున్ నాయక్, తిరుపాలు, నాగరత్న, రాజ్యలక్ష్మి, లలిత, రామిరెడ్డి, రాఘవేంద్ర, శాంతరాజు తదితరులు పాల్గొన్నారు.

సమగ్రశిక్ష ఏపీసీని విధుల నుంచి తొలగించాలి

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉత్తర్వులను పాటించకుండా బేఖాతరు చేస్తున్న సమగ్రశిక్ష ఏపీసీని విధులనుంచి తొలగించాలని ఆర్ఎస్పీఎస్ అధ్యక్షుడు జీవీ ఉజ్వల్ డిమాండ్ చేశారు. నగరంలోని ఆ సంఘం కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఉజ్వల్ మాట్లాడుతూ రిజర్వేషన్ ఉద్యోగుల హక్కుల కోసం గత వైసీపీ ప్రభుత్వంలో పోరాటాలు చేశామన్నారు. కూటమి ప్రభుత్వం ఆయా వర్గాల ఉద్యోగుల ఆకాంక్షలు నెరవేర్చేలా పనిచేస్తోందన్నారు. ఇందులో భాగంగా గతనెల 19న విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారన్నారు. వాటిని అమలుచేయాల్సిన ఏపీసీ శైలజ ప్రభుత్వ ఆదేశాలకు వ్యతిరేకంగా పని చేస్తూ జిల్లా కలెక్టర్‌నే పక్కదోవ పట్టిస్తోందని మండిపడ్డారు. ఏపీసీని విధులనుంచి తొలగించకపోతే సమగ్రశిక్ష కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఆర్‌ఈఎఫ్ వైస్‌చైర్మన్ రామకృష్ణ, జిల్లా అధ్యక్షులు ముత్యాలరాజు, రాయలసీమ అధ్యక్షులు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఓనం వేడుకలు



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న అయ్యప్పస్వామి

అనంతపురం టౌన్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి) : కేరళీయుల నూతన సంవత్సరాది పండుగ అయిన ఓనం వేడుకలను శుక్రవారం నగరంలోని అయ్యప్పస్వామి ఆలయాల్లో వైభవంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో చెరువుకట్టపై వెలసిన అయ్యప్ప ఆలయంలో అర్చకులు గణపతిపూజతో వేడుకలను ప్రారంభించారు. అనంతరం స్వామి మూలవిరాట్‌కు భస్మాభిషేకం, ఫలపంచామృతాభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు, పూజాది కైంకర్యాలు నిర్వహించారు. మహామంగళహారతి నివేదనానంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ కార్యవర్గం, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా గురుపూజోత్సవం

- సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు ఘన నివాళులు

అనంతపురంరూరల్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో శుక్రవారం గురుపూజోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి వర్సిటీ రిజిస్ట్రార్ రమేష్‌బాబు, రెక్టార్ వెంకటనాయుడు, మాజీ రిజిస్ట్రార్ లక్ష్మయ్య తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. ఉపాధ్యాయుడి నుంచి రాష్ట్రపతి స్థాయికి ఎదిగిన మహోన్నత వ్యక్తి సర్వేపల్లి రాధాకృష్ణన్ తెలిపారు. ఆయన ఉపాధ్యాయుడికి నిర్వచనంగా నిలిచారని కొనియాడారు. ఆయన జయంతిని గురుపూజోత్సవంగా జరుపుకుంటుండడం ఆనందంగా ఉందని అన్నారు. అనంతరం 2024-25వ విద్యాసంవత్సరంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్న ఆచార్య లక్ష్మయ్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అంజనేయులు, ప్రొఫెసర్లు ముని నారాయణప్ప, నరసింహ, శోభాలత, రవిప్రసాద్, భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

●అనంతపురం విద్య: అశోక్‌నగర్‌లో గల శ్రీసాయి విద్యానికేతన్ పాఠశాలలో గురుపూజోత్సవ వేడుకల సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం టీచర్లకు ఆటలపోటీలు నిర్వహించి విజేతలకు కరస్పాండెంట్ కుసుమాపుల్లారెడ్డి అవార్డులు అందించి సత్కరించారు. ప్రిన్సిపాల్ రఘునాథ్‌రెడ్డి, డైరెక్టరు రామక్రిష్ణారెడ్డి,టీచర్లు,విద్యార్థులు పాల్గొన్నారు.

●అనంతపురం ప్రెస్‌క్లబ్: ఏపీ ప్రభుత్వ పెన్షనర్ల సంఘం సభ్యులు స్థానిక సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు పెద్దనగౌడ్ ఆధ్వర్యంలో రిటైర్డ్ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అలాగే సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ అధ్యక్షుడు ఎంవీ రమణ, అసోసియేషన్ ప్రెసిడెంట్ ఖలందర్, కోశాధికారి రామకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రభాకర్, ఉపాధ్యక్షుడు డేనియల్ ప్రభాకర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

● అనంతపురం క్లాక్‌టవర్: స్థానిక ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యాలయంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సొసైటీ అధ్యక్షుడు సుంకర రమేష్, కార్యదర్శి మహేంద్ర ధోని, చాందిని, సోనీ, శిరీష, బాలాజీ, అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

● రామగిరి: మండలకేంద్రంలోని షిర్డీసాయి విద్యానికేతన్‌లో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తర్వాత విశ్రాంత ఉపాధ్యాయుడు విద్వాన్ గుగ్గిళ్లరాజును హెచ్ఎం చల్లగుండ్ల ముత్యాలప్ప, ఉపాధ్యాయబృందం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు డాక్టర్ నాగభూషణ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్కేయూలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతను సన్మానిస్తున్న రిజిస్ట్రార్, రెక్టార్ తదితరులు



శ్రీసాయి విద్యానికేతన్‌స్కూల్‌లో సర్వేపల్లి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కరెస్పాండెంట్, టీచర్లు

విజయవంతం చేస్తాం: టీసీ వరుణ్

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ .. సూపర్ హిట్ మహాసభను పండుగలా నిర్వహించి విజయవంతం చేస్తామని జనసేన జిల్లా అధ్యక్షుడు, అహుడా చైర్మన్ టీసీ వరుణ్ శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. సభా ప్రాంగణంలో వేదిక, పార్కింగ్ ఏర్పాట్లను మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్‌తో కలిసి పరిశీలించామన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే సూపర్ సిక్స్ హామీలను చిత్తశుద్ధితో అమలు చేసి సూపర్ హిట్ చేయడం జరిగిందన్నారు. అందుకుగాను ఈ నెల 10న జిల్లాకేంద్రంలో నిర్వహించనున్న సూపర్ సిక్స్ - సూపర్ హిట్ మహాసభలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌తో పాటు మంత్రులు పాల్గొని ప్రజలకు తమ సందేహాన్ని ఇవ్వనున్నట్లు చెప్పారు. ఏర్పాట్ల పరిశీలనలో జనసేన నగర అధ్యక్షుడు బాబూరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పత్తి చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శులు , నాయకులు ఎత్తున పాల్గొన్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా సుబ్రహ్మణ్యం



సుబ్రహ్మణ్యంకు శుభాకాంక్షలు తెలుపుతున్న వైద్యులు

అనంతపురం వైద్యం, సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్‌గా ప్రొఫెసర్ సుబ్రహ్మణ్యం శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు పనిచేస్తున్న ప్రొఫెసర్ ఆత్మారామ్ రిలీవ్ అయ్యి సుబ్రహ్మణ్యంకు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆత్మారామ్‌తోపాటు జనరల్ మెడిసన్ విభాగాధిపతి డాక్టర్ భీమసేనాచారి, గైనకాలజీ డాక్టర్ సుచిత్ర, అడ్మినిస్ట్రేటర్లు డాక్టర్ శ్రీనివాస్‌శౌరి, డాక్టర్ సౌజన్యకుమార్, అధికారులు జంబునాథ్, పవన్‌కుమార్ తదితరులు సుబ్రహ్మణ్యంకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ముస్లింలకు వాటర్ బాటిళ్ల పంపిణీ



ముస్లింలకు నీళ్ల బాటిళ్లు పంపిణీ చేస్తున్న భవానీ రవికుమార్

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మిలాద్ ఉన్ నబీ వేడుకల సందర్భంగా జిల్లా కేంద్రంలో శుక్రవారం ముస్లింలు పెద్ద ఎత్తున ర్యాలీ చేపట్టారు. అందులో జనసేన రాష్ట్ర కార్యనిర్వాహణ ప్రధాన కార్యదర్శి , స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డైరెక్టర్ భవాని రవికుమార్ పాల్గొని ముస్లిం పెద్దలకు పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ.. వాటర్ బాటిళ్లను పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని మతాలను గౌరవించడమే జనసేన సిద్ధాంతమని తెలిపారు. నాయకులు గల్లా హర్ష, రమణ, భాస్కర్, కాలేషా, దరాజ్‌బాషా, మధు, సంపత్, జయకృష్ణ, చిన్న, విజయ్, వీర మహిళలు శైలజా, శరణ్య, అనసూయ, ఉష, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జ్యూస్ పంపిణీ

అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): నగరంలో ముస్లింలకు వైసీపీ నాయకుడు అనిల్‌కుమార్ గౌడ్ జ్యూస్, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. మిలాద్ ఉన్ నబీ పండుగను పురస్కరించుకని 50వ డివిజన్‌లో ర్యాలీగా వెళ్తున్న ముస్లింలకు ఆయన వాటిని అందజేశారు. నాయకులు పెన్నోబులేసు, ఓబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధితుడి నుంచి వాంగ్మూలం సేకరణ



ఉలిగన్న నుంచి వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): విడపనకల్లు మండల కేంద్రానికి చెందిన ఉలిగనన్న దాడికి గురై జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ప్రాణాప్రాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. ఈ ఘటనపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును నమోదుచేశారు. శుక్రవారం గుంతకల్లు డీఎస్పీ ఏ.శ్రీనివాసులు ఆస్పత్రికి చేరుకుని బాధితుడి నుంచి దాడికి సంబంధించిన వాగ్మూలాన్ని సేకరించారు. ఉలిగన్నపై పాశవికంగా దాడికి పాల్పిడన వారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డీఎస్పీని దళిత సంఘాల నాయకులు కోరారు. మూకుమ్మడిగా దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడినా కేవలం అట్రాసిటీ కేసును నమోదుచేయడం దారుణమని మండిపడ్డారు. బాధితుడికి ఏమైనా జరిగితే ఎవరు బాధ్యతవహిస్తారని ప్రశ్నించారు. దాడిచేసిన వారిపై హత్యాయత్నం కేసును నమోదుచేయకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఉలిగన్న ఆరోగ్యస్థితిపై డీఎస్పీ వైద్యులను అడిగి తెలిసుకున్నారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు సాకే హరి, అక్కులప్ప, సామ్రాట్ మధు, యల్లన్న, రామకృష్ణ, దొడ్డప్ప, సూరి, ఆనందరాజు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



ఎరువుల దుకాణంలో స్టాక్‌ను పరిశీలిస్తున్న అధికారులు

నార్పల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ఎరువుల దుకాణాలను నార్పల, సింగనమల తహసీల్దార్లు, వ్యవసాయ అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. మండల కేంద్రంలోని ఎఫ్ఎస్‌సీఎస్, తిరుమల ట్రేడర్స్, వెంకటేశ్వర కెమికల్స్ అండ్ ఫర్టిలైజర్స్, లక్ష్మీగణేష్ ఫర్టిలైజర్ దుకాణాలలో యూరియా నిల్వలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ నార్పల మండలంలో 35 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఉందన్నారు. ప్రతి రైతుకు రెండు బస్తాలచొప్పున యూరియాను సరఫరా చేయాలన్నారు. ఎరువులు తీసుకున్న ప్రతి రైతుకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అరుణకుమారి, వ్యవసాయ అధికారి చెన్నవీరస్వామి, సింగనమల తహసీల్దార్ శేషారెడ్డి, సీఎస్‌డీటీ చంద్రకళ పాల్గొన్నారు.

మంత్రి కొల్లు రవీంద్రకు ఘనస్వాగతం



మంత్రిని సన్మానిస్తున్న చేపల హరి

అనంతపురం క్రైం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్రకు తెలుగుదేశం పార్టీ బెస్త రాష్ట్ర సాధికార కమిటీ సభ్యుడు, అనంతపురం 5వ క్లస్టర్ ఇన్‌చార్జి చేపల హరి, ఇతర నాయకులు ఘనస్వాగతం పలికారు. అనంతపురం జిల్లా పర్యటనకు బెంగళూరు నుంచి రోడ్డు మార్గాన వస్తున్న మంత్రికి మరూరు టోల్ ప్లాజా వద్ద చేపల హరి, ఇతర నాయకులు గజమాల వేసి, శాలువ కప్పి ఘన స్వాగతం పలికారు. తర్వాత అనంతపురంలో ఆయన వెంట నడిచారు. కార్యక్రమంలో బలిజ సంఘం యువజన నాయకులు రమేష్, టీడీపీ నాయకులు రాయల్ మధు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఆలయాల అభివృద్ధికి కృషి: విప్ కాలవ


నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న విప్ కాలవ

కణేకల్లు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆలయాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మండలంలోని మాల్యం గ్రామంలో వెలసిన కల్లేశ్వర ఆలయ నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మొదటగా ఆలయ ధర్మకర్తగా విజయ్‌ను ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం విప్ మాట్లాడుతూ 2016లో మంత్రిగా ఉన్నపుడు ఆలయ జీర్ణోద్ధరణకు రూ.45 లక్షల నిధులను అందించామన్నారు. తిరిగి ఇప్పుడు విప్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించాక పాలకవర్గ ప్రమాణోత్సవానికి హాజరు కావడం ఆనందంగా ఉందన్నారు. ఆలయాల అభివృద్ధికి తమ ప్రభుత్వం ఎపుడూ ముందుంటుందన్నారు. సనాతన ధర్మాన్ని పాటించడంతో పాటు దాన్ని కాపాడడం కూడా తమ బాధ్యతగా పని చేస్తామన్నారు. కార్యక్రమంలో దేవదాయ ఇన్‌స్పెక్టర్ రాణి, ఈఓలు దేవదాసు, బాబు, టీడీపీ నాయకులు లాలెప్ప, ఆది, వేలూరు మరియప్ప, కోళేకుర్తి సుదర్శన్, వన్నారెడ్డి, బీటీ రమేష్, ఎంపీటీసీ నరేంద్ర, అనిల్, జయరాంచౌదరి, రఘునాథ్, నాగరాజు, చాంద్ బాషా, మారుతి, ప్రభాకర్, శరభనగౌడ్, అశోక్, యువరాజ్, సూరి, హరి, నరేష్, మాబు, ఎల్లప్ప, వంద్ర పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన


సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఉరవకొండ, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాకెట్లలో సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. విషజ్వరంతో బాలుడు మృతి అనే కథనం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన విషయం తెలిసిందే. పీహెచ్‌సీ అధికారి వెంకటేష్‌నాయక్, సిబ్బంది కలిసి శుక్రవారం ఇంటింటికీ తిరిగి ఫీవర్ సర్వే నిర్వహించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మురుగునీరు నిల్వ ఉన్న ప్రదేశాలలో స్ప్రే చేయించారు. మలేరియా అధికారి కోదండ రామిరెడ్డి, సూపర్‌వైజర్లు శేఖర్, స్వర్ణలత పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడికి సన్మానం

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక వాసవీ థియేటర్‌లో శుక్రవారం సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడిగా ఎన్నికైన బీ గోవిందుకు నారాలోకేశ్ అభిమాన సంఘం జాతీయ అధ్యక్షుడు ఆనంద్‌రెడ్డి, నారాయణ ఆధ్వర్యంలో సన్మానించారు. ఆనంద్‌రెడ్డి మాట్లాడుతూ గోవిందు 45 సంవత్సరాల నుంచి సీపీఐలో పనిచేస్తూ అనేకమంది పేదలకు, బడుగు బలహీన వర్గాలకు ఇంటి పట్టాలను మంజూరు చేయించడంలో కృషి చేశారన్నారు. లోకేంద్ర, సర్వేశ్వర రెడ్డి, టీడీపీ శ్రీకాంత్, రామన్న, హనుమేష్, కదిరప్ప, పురుషోత్తం పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ బస్సు డ్రైవర్ల నిరసన

తాడిపత్రి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): తాడిపత్రి డిపో వద్ద కాంట్రాక్ట్ బస్సు డ్రైవర్లు, కండక్టర్లు నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ శుక్రవారం తాడిపత్రి నుంచి గుత్తికి వెళుతున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్, కండెక్టర్‌పై గుత్తి మండలం జక్కలచెరువు గ్రామంలో కొంతమంది వెంబడించి దాడి చేశారని వాపోయారు. దాడి చేస్తే తాము ఎలా పని చేయాలని ప్రశ్నించారు. దాదాపు 42 బస్సులు ఈరోజు రూట్‌లకు వెళ్లకుండా నిలిపివేశారు. అధికారులు స్పందించి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

సమాజానికి ఉపాధ్యాయులు మార్గదర్శకులు

సమాజానికి ఉపాధ్యాయులు మార్గదర్శకులని పలువురు వక్తలు అన్నారు. శుక్రవారం గురుపూజోత్సవాన్ని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం అధ్యాపకులు, ఉపాధ్యాయులను విద్యార్థులు, సమాజ సేవకులు సన్మానించారు.

- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్


ఉరవకొండలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు



గుంతకల్లులో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న అవోపా నాయకులు


బెళుగుప్ప: శ్రీనివాస విద్యానికేతన్‌లో ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న కరస్పాండెంట్ శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ సుమ



యాడికిలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు

గ్యాస్ సిలిండర్ డెలివరీకి ఐదురోజులా..?

- అదనంగా చెల్లిస్తేనే ఇంటికి..
- రసీదు రూ.922 వసూలు రూ.970
- బుక్ చేయకపోతే రూ.1050


గ్యాస్ సిలిండర్లను సరఫరా చేస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్యాస్ ఏజెన్సీ నిర్వాకులు సిలిండర్ ధర మీద అదనంగా వసూలు చేస్తూ వినియోగదారులపై అదనపు భారం మోపుతున్నారు. గృహ వినియోగం కోసం సరఫరా చేసే సిలిండర్లను కమర్షియల్ కోసం వాడుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్యాస్ లేనిదే ఇంట్లో ఎలాంటి పనులు జరగవు. గ్యాస్ ఇంటికి రావడానికి ఐదు రోజులు సమయం పడుతోంది. ఫాస్టుఫుడ్ సెంటర్లు, హోటళ్లకు మాత్రం గంటలో డెలివరీ చేస్తున్నారు. ఇంటికి గ్యాస్ సిలిండర్ డెలివరీ కావాలంటే ఐదు రోజులు పడుతుందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనికి కారణం సిలిండర్లను డెలివరీ బాయ్స్, ఏజెన్సీ నిర్వాహకులు బయట అమ్ముకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు నిద్రమత్తులో జోగుతున్నారని ప్రజలు ఆగ్రహిస్తున్నారు. మండలంలో 8 వేలకు పైగా గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ప్రతిరోజు 300 నుంచి 350 వరకు సిలిండర్లు సేల్స్ అవుతున్నాయి. ఏజెన్సీ నిర్వాహకులు ఆటోల ద్వారా గ్రామాలకు సరఫరా చేస్తుంటారు. నిర్వాహకులు మాత్రం డెలివరీ చార్జీల పేరుతో వినియోగదారులపై అదనపు భారం మోపుతున్నారు. ఇంటికి వచ్చి సిలిండర్ డెలివరీ చేస్తే బిల్ మీద ఉన్నదాని కంటే రూ. 50 నుంచి రూ.100 అదనంగా వసూలు చేస్తున్నారు. ఒకవేళ ఇవ్వకుంటే అలా స్వంగా డెలివరీ చేయడం, లేదా మీ ఇంటికి బీగం వేశారని చెబుతున్నారు. ఇలా చేయడం వల్ల సరైన సమయంలో సిలిండర్ అందడం లేదని సామాన్యులు వాపోతున్నారు.

మామూళ్ల మత్తులో అధికారులు

ఇంటి అవసరాలకు వాడుకునే వంట గ్యాస్‌ను కమర్షియల్‌కు వాడుతుంటే ఉన్నతాధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇందుకు అధికారులు కూడా మామూళ్లు తీసుకుని వదిలేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వంట గ్యాస్ అక్రమంగా అమ్ముతుంటే ఎందుకు అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అదనంగా వసూలు చేస్తున్నారు
- లక్ష్మి, శ్రీధరఘట్ట

గ్యాస్ సిలండర్ బుక్ చేసుకోగా డెలివరీకి రూ.1000 తీసుకున్నారు. రసీదులో రూ.922 మాత్రమే ఉంది. అదేమని అడిగితే బిల్లు ధర ఉండేది ఇస్తే డీజిల్ బావి మా ఇంట్లో ఉందా ఎదురు ప్రశ్నిస్తున్నారు. డీజిల్ రేట్లు పెరిగడంతో డెలివరీ చార్జీలు పెంచామని అంటున్నారు.

బుక్ చేసిన 5 రోజులకు వచ్చారు
- ఉమాదేవి, గోవిందవాడ

1వ తేదీన గ్యాస్ బుక్ చేశాను. ఐదురోజులకు ఇంటి వచ్చారు. నాలుగురోజులు డబ్బు ఉంచుకున్నా. 5వ రోజు వచ్చి సిలిండర్ తీసుకోవాలని అడిగారు. డబ్బు లేకపోవడంతో సిలిండ్ తీసుకోలేదు. అయితే సిలిండర్ డెలివరీ అయినట్లు ఫోన్‌కు మేసేజ్ వచ్చింది. ఈ నెల సిలిండర్ రానట్లే.

అదనంగా వసూలు చేస్తే చర్యలు
- మునివేలు, తహసీల్దార్

వినియోగదారుల నుంచి గ్యాస్ సిలిండర్ డెలివరీ చార్జీలు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటాం. అలా వసూలు చేసినట్లు తమ దృష్టికి వస్తే కేసులు నమోదు చేస్తాం. వినియోగదారులు బాయ్స్‌కు అదనంగా చెల్లించాల్సిన అవసరం లేదు.

సమాజానికి గురువులే ఆదర్శం: ఎమ్మెల్యే



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి): గురువులు సమాజానికి ఆదర్శమని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. నాటి వైసీపీ ప్రభుత్వంలో గురువులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడ్డారని విమర్శించారు. శుక్రవారం పట్టణంలోని ప్రజావేదిక వద్ద ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. గురువులకు ఎమ్మెల్యే పాదాభివందనం చేశారు. అనంతరం 300 మందికి పైబడి గురువులను పూలమాలలు, దుశ్శాలువాలతో సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ పాలనలో గురువులు అనేక ఇబ్బందులకు గురయ్యారన్నారు. కనీసం ఒకటో తేదీ జీతాలు తీసుకునే పరిస్థితి లేదన్నారు. పీఆర్సీ అంటూ చర్చలకు పిలిచి వారిని నిలువునా మోసం చేశారని గుర్తు చేశారు. ఉపాధ్యాయులందరూ అడుగడుగునా వైసీపీ హయాంలో ఇబ్బందులు పడ్డారని వాపోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ నిర్వహించి 16 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశామన్నారు. విద్యాశాఖమంత్రిగా ఉన్న నారాలోకేశ్ విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేస్తూ, ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరిస్తున్నారన్నారు. న్యాయబద్ధంగా ఉపాధ్యాయులకు అందాల్సిన పీఆర్సీ, డీఏలు తప్పకుండా అందుతాయన్నారు. బీటీపీ ప్రాజెక్టు కాలువ పనులు నిద్రపోయినా, లేచినా అదే గుర్తుకు వస్తోందన్నారు. పాత ధరకే ఈ ప్రాజెక్టు కాలువ పనులు చేస్తున్నామని, ఇటీవల సీఎం చంద్రబాబు కూడా మంచి నిర్ణయం తీసుకున్నావని అభినందించారని అన్నారు. ఉపాధ్యాయులు, కూటమి నాయకులు, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ముగ్గురి మృతి

గుత్తి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో చికిత్స పొందుతూ ముగ్గురు మృతిచెందారు. ఉరవకొండ మండలం రాంపూరం గ్రామానికి చెందిన రమేష్ (33)అనే వ్యక్తి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. రమేష్ పట్టణంలోని ఎస్సీ కాలనీలో అత్తగారి ఇంటికి వచ్చి ఆత్మహత్యకు యత్నించాడు. కర్నూలు ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బ్రహ్మసముద్రం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేపులపర్తి గ్రామ సమీపంలో చాకలి వన్నూరుస్వామి(50) అనే వ్యక్తి 3వ తేదీన ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు గమనించి అనంతపురం ఆస్పత్రిలో చికిత్సకు చేర్పించారు. శుక్రవారం చికిత్స పొందుతూ మృతిచెందాడు. వన్నూరుస్వామి రాయదుర్గం పట్టణం కోటవీధిలో నివాసముంటున్నాడు. వేదవతి హగరి నది వద్ద బట్టలు ఉతికేందుకు వస్తుండేవాడు. 3వ తేదీ బుధవారం కడుపునొప్పి ఎక్కువ కావడంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఎస్ఐ నరేంద్ర కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

కూడేరు (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముద్దలాపురం గ్రామానికి చెందిన రైతు పెన్నోబిలేసు(26) గడ్డి మందు తాగి ఆస్పత్రిలో చికిత్సపొందుతూ శుక్రవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు గత నెల 21న ఇంట్లో ఎవరూ లేని సమయంలో రైతు గడ్డి మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. కుటుంబ సభ్యులు గమనించి అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పెన్నోబిలేసుకు రెండున్నర ఎకరాల పొలంలో ఆముదం, మిరప సాగు చేసేందుకు రూ.4.5 లక్షలు వరకు అప్పులు అయినట్లు తెలిపారు. మృతుడి భార్య భాగ్యలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పెన్నోబిలేసుకు భార్యతో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు

బైకుపై నుంచి కిందపడి రైతు..


వెంకటేశులు (ఫైల్)

బెళుగుప్ప, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని నరసాపురం గ్రామానికి చెందిన రైతు వెంకటేశులు (58) శుక్రవారం ప్రమాదవశాత్తు బైకుపై నుంచి కిందపడి మృతి చెందారు. మృతుడి బంధువు ఫిర్యాదు మేరకు పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి.. వెంకటేశులు స్వగ్రామం నుంచి బంధువు బైకుపై వెళుతుండగా మార్గమధ్యలో అకస్మాత్తుగా పడిపోయాడు. ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే ఆయన మృతి చెందాడని డాక్టర్లు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్య రాధ, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

కోమటికుంట్లలో చోరీ

పుట్లూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోమటికుంట్ల గ్రామంలోని ఓ కిరాణా దుకాణంలో చోరీ జరిగినట్లు శుక్రవారం పోలీసులు తెలిపారు. బాబు అనే వ్యక్తి కిరాణా దుకాణం నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం రాత్రి దుకాణం మూసి వేసి ఇంటికి వెళ్లాడు. గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు దుకాణంలోకి చొరబడి రూ.5 వేలు ఎత్తుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. ఉదయం వచ్చి షాపు తెరవగా డబ్బులు లేకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

హెల్మెట్ తప్పనిసరి: ఎస్ఐ

రాయదుర్గం రూరల్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ ప్రసాద్‌బాబు సూచించారు. శుక్రవారం సాయంత్రం పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయం వద్ద వాహనాలు తనిఖీ చేశారు. రికార్డులు సక్రమంగా లేని 15 ద్విచక్రవాహనదారులకు అపరాధరుసుం విధించారు.

సైబర్ నేరాలపై అవగాహన

బొమ్మనహాళ్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై గ్రామీణ ప్రాంత ప్రజలు అవగాహన కలిగి ఉండాలని డిజిటల్ సైబర్ వెహికల్ ద్వారా జిల్లా ఎస్పీ జగదీష్ అవగాహన కల్పించారు. శుక్రవారం మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి చుట్టూ ఉన్న సమాజాన్ని కూడా జాగ్రత్త ఉండేలా సూచించాలని ఎస్పీ వివరించారు. ఎస్ఐ నబీరసూల్ పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక కసాపురం పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించనున్న క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్లను ఎస్ఐ టీపీ వెంకటస్వామి చేతుల మీదుగా ఆవిష్కరించారు. నాయకులు మాట్లాడుతూ భగత్‌సింగ్ 119వ జయంతి సందర్భంగా క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నామన్నారు. 28వ తేదీ నుంచి కసాపురంలోని మారుతి నగర్ వద్ద నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 25లోపు టీంల పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మొదటి బహుమతి రూ.20,016, రెండో బహుమతి రూ.10,116, మూడో బహుమతి 5,016 అందజేస్తామన్నారు. జిల్లాకార్యదర్శి రమేష్, పట్టణకార్యదర్శి సురేంద్రబాబు, సీనియర్ క్రికెటర్లు చక్రవర్తి, ఎర్రిస్వామి, తిరుపాల్, త్యాగరాజ్ పాల్గొన్నారు.

సన్మాన సభకు తరలిరండి

తాడిపత్రి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): తాడిపత్రి మార్కెట్ యార్డ్ చైర్మన్ భూమా నాగరాగిణి సన్మాన సభకు తరలిరాలని శుక్రవారం జేసీ అభిమానులు, కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. స్థానిక మార్కెట్ యార్డ్‌లో నిర్వహించే కార్యక్రమానికి నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున రావాలని కోరారు.

సీఎం పర్యటనను విజయవంతం చేద్దాం


ఉరవకొండలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ఉరవకొండ, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ సూపర్ హిట్ కార్యక్రమంలో భాగంగా 10వతేదీన అనంతపురంలో నిర్వహించే సీఎం పర్యటనను విజయవంతం చేద్దామని ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్ దేవినేని పురుషోత్తం, ఏఎంసీ మాజీ చైర్మన్లు నాగరాజు, మారెన్న, మాజీ ఎంపీపీలు కుళ్లాయప్ప, సుంకరత్నమ్మ పిలుపునిచ్చారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం సీఎం పర్యటనపైన సమావేశం నిర్వహించారు. సభకు జన సమీకరణ ఏర్పాట్లపైన చర్చించారు. గోవిందు, తిమ్మప్ప, ప్యారం కేశవానంద, బీరే శేఖర్, గుర్రం నరేష్, లాల్‌స్వామి, తాజుద్దీన్ పాల్గొన్నారు.

టీడీపీ శ్రేణులు తరలిరండి

విడపనకల్లు, (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా పర్యటనకు 10వ తేదీన సీఎం చంద్రబాబు సభకు టీడీపీ మండల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి రావాలని మండల కన్వీనర్ బీడీ చిన్న మారయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో వివిధ గ్రామాల మండల నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. సూపర్ సిక్స్ సూపర్ హిట్ సభను జయప్రదం చేయాలన్నారు. సర్పంచ్‌లు చంద్రశేఖర్, జనార్ధననాయుడు, తిమ్మరాజు, తిప్పారెడ్డి, నాయకులు రామాంజనేయులు, హనుమంతు, భీమలింగప్ప, రవీంద్ర, దేవేంద్ర, కుమారుస్వామి, మారయ్య, సీతారాముడు, నాగేశ్వర్‌రావు, పరమేశప్ప, వీరభద్రారెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.


విడపనకల్లులో మాట్లాడుతున్న మండల కన్వీనర్ చిన్నమారయ్య

ఘనంగా మిలాద్-ఉన్-నబీ వేడుకలు

మిలాద్-ఉన్-నబి పండుగను శుక్రవారం ముస్లింలు ఘనంగా నిర్వహించారు. మహమ్మద్ ప్రవక్త పుట్టి 1500 సంవత్సరాలు అయిన సందర్భంగా వీధుల్లో మక్కా మసీదు నమూనాను, జెండాలను ప్రదర్శించారు. బైక్ ర్యాలీలు నిర్వహించారు. అనంతరం మసీదుల్లో ప్రార్ధనలు చేశారు.

-ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్


యాడికిలో ర్యాలీ చేస్తున్న ముస్లింలు


తాడిపత్రి: ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే అస్మిత్ రెడ్డి















రిజర్వాయరుకు 2,164 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు 2164 క్యూసెక్కుల నీరు వస్తున్నట్లు శుక్రవారం హంద్రీనీవా అధికారులు తెలిపారు. ఔట్‌ఫ్లో 2124 క్యూసెక్కులు వుండగా రిజర్వాయరులో 1.697 టీఎంసీల నీరు నిల్వ వుందని వెల్లడించారు. ఫేజ్-2కు 1950 క్యూసెక్కులు వెళుతున్నాయని తెలిపారు.

ఇలా ఉంటే రోగాలు రావా..?

- తెనగల్లు గ్రామంలో ఎటుచూసినా చెత్త దిబ్బలే..


పాఠశాల పక్కనే పేరుకుపోయిన చెత్తాచెదారం

కుందుర్పి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని తెనగల్లులో పాఠశాల సమీపాన చెత్తాచెదారం, మురుగునీరు చేరి పందులకు ఆవాసాలుగా మారాయి. దీంతో దోమలు, ఈగలు పెరిగిపోయాయి. అసలే సీజనల్ వ్యాధులు వ్యాపిస్తూ ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. ఇలా అపరిశుభ్రంగా వుంటే రోగాలు రావా అని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. నిత్యం మురుగునీరు ప్రధాన రహదారి గుండా పాఠశాల వద్ద ఖాళీ స్థలంలో చెత్తాచెదారం నిండటమే కాకుండా అందులోకి మురుగునీరు ప్రవహిస్తోంది. పక్కనే పాఠశాల ఉండటంతో దుర్వాసన వెదజల్లుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చెత్తాచెదారాన్ని తొలగించి మురుగునీరు రాకుండా చూడాల్సిన బాధ్యత ఎంతైనా వుందని గ్రామస్థులు అంటున్నారు.